VISALAANDHRA Phone No 75301
* * * Regd No H/VJ 4

విశాలాంధ్ర

203528

సంపుటి 26 సంచిక 292 | విజయవాడ 17—2—1977 గురువారం | 4 పేజీలు 30 పైసలు

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంట్లుద్వారా	పోస్టుద్వారా
నెల చందా	9—20	9—80
మూడు నెలలు	47—60	29—40
ఆరు నెలలు	55—20	58—80
సంవత్సరం	110—40	117—60

ఈ రేట్లు అడ్వాన్సుగా చందా చెల్లించినవారికి మాత్రమే వర్తించును.

జైల్లో "నలుగురు ముఠా"

టోకియో ఫిబ్రవరి 16

మావో సేటుంగ్ సతీమణి చియాంగ్ చింగ్ ఆమె అనుచరులు ముగ్గురితో సహా ప్రస్తుతం జైల్లోవున్నారని చైనా అగ్రస్థాయి అధికారి ఒకరు అన్నట్లు ఇక్కడ తెలియవచ్చింది వారికి మరణశిక్ష విధించడం జరగదని ఆ అధికారి తెలిపారు

ఆ నలుగురు అతివాదులు ప్రస్తుతం తాము చేసిన నేరాల విషయమై ఆత్మవిమర్శ చేసుకుంటున్నారని ఆ అధికారి అన్నట్లు ఎ. ఎఫ్. పి విలేకరి రాస్తున్నారు

కమ్యూనిస్టు, ప్రజాతంత్ర అభ్యర్థుల విజయమే దేశభవిష్యత్తుకు మార్గం

కాంగ్రెస్‌లేదా జనతాపార్టీల విజయం ప్రత్యామ్నాయం కాదు: విజయవాడ ఎన్నికల సభలో శ్రీ గిరిప్రసాద్ స్పష్టీకరణ



సభలో ప్రసంగిస్తున్న శ్రీ నల్లమల గిరిప్రసాద్, వేదికపై వరుసగా శ్రీ దాసరి నాగభూషణరావు, శ్రీ తమ్మిన పోతరాజు, శ్రీ ఎం. వి. ఎస్. కపర్ది.

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఫిబ్రవరి 16

"దేశానికి మంచిభవిష్యత్తువుండాలంటే కమ్యూనిస్టుపార్టీ, ప్రజాతంత్ర అభ్యర్థులు నూతన పార్లమెంటుకు ఎక్కువ సంఖ్యలో గెలుపొందాలని, కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ లభించినా, జనతాపార్టీ గెలుపొందినా ప్రజలకు మేలు కలగబోదని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్ నేడిక్కడ స్పష్టం చేశారు.

విజయవాడ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని శ్రీ గిరిప్రసాద్ నేడు ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభలో శ్రీ గిరిప్రసాద్ ప్రసంగిస్తూ యిలా అన్నారు.

"దేశ రాజకీయాలలో అత్యంత కీలకమైన ఎన్నికలు జరగబోతున్నాయి. దేశంలో సుస్థిరత సాధనకోసం కాంగ్రెసుపార్టీకి పూర్తి మెజారిటీ రావాలని కొందరు నాయకులు కోరుతున్నారు. కాంగ్రెసు పాలన అంతమయి ప్రజలకు మేలు కావాలంటే జనతా పార్టీ విజయం అవసరమని మరి కొందరు నాయకులు చెపుతున్నారు. కాంగ్రెసుకు మెజారిటీ వచ్చినా, జనతా పార్టీ గెలుపొందినా దేశ ప్రజలకు మేలు జరగదని స్పష్టం చేస్తున్నాను

పార్లమెంటులో వివిధ శాసనసభలలో పెద్ద మెజారిటీలు కలిగిన కాంగ్రెసు ఏం సుస్థిరతను సాధించింది. ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో సంక్షోభాలు సృష్టించబడ్డాయి. ఆ సంక్షోభాన్ని పరిష్కరించుకోలేక 1969లో చీలిక ఏర్పడింది మొరార్జీదేశాయ్ 60 మంది పార్లమెంటు సభ్యులతో వెలుపలికి వచ్చారు. అనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీ యితర ప్రజాతంత్ర వాదులపై ఆధారపడవలసి వచ్చింది. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు లాంటి చర్యలు సాధ్యమయ్యాయి. 1971లో కాంగ్రెసుకు పార్లమెంటులో పెద్ద మెజారిటీ వచ్చింది. ఏం సుస్థిరత సాధించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో వేర్పాటు ఉద్యమాలు, బీహారులో "సంపూర్ణ విప్లవం" లాంటి ఉద్యమాలు వచ్చాయి. [illegible] శక్తుల నాయకత్వాన, మితవాద వర్గాల ప్రయోజనాల కొరకు ఈ ఉద్యమాలు ప్రారంభించబడ్డాయి. ఆ ఉద్యమాల సందర్భంగా పెద్ద మెజారిటీలు ఏంచేయలేకపోయాయి. కమ్యూనిస్టుపార్టీ సూత్రబద్ధ వైఖరితో ఈ ఉద్యమాలను యితర ప్రజాతంత్ర శక్తుల సాయంతో దెబ్బతీసింది. వచ్చి మితవాదతిరుగుబాటుద్వారా కేంద్రంలో అధికారంలోకి రావాలని ప్రయత్నించారు. అదేగనుక జరిగివుంటే లక్షలాది ప్రజాతంత్ర వాదులు ఈరోజు ఈ విధంగా వుండగలిగేవారు కాదు. మితవాద శక్తుల ప్రమాదాన్ని దెబ్బతీయటానికి అత్యవసర పరిస్థితి ప్రకటించబడింది.

మెజారిటీ మితవాద శక్తుల ప్రమాదాన్ని దెబ్బతీయలేక పోయింది

కాంగ్రెసులో అభివృద్ధి నిరోధకులున్నారని యిప్పుడు కాదు, ఏనాటినుండో కమ్యూనిస్టుపార్టీ చెపుతున్నది. గత సంవత్సరం కాలంగా మరీ ముఖ్యంగా గత ఏడు నెలలుగా కాంగ్రెస్‌లో అభివృద్ధి నిరోధకుల ప్రాబల్యం అధికమయింది. 20 అంశాల అమలు దెబ్బతీయబడింది. అత్యవసరపరిస్థితి సందర్భంగా యిచ్చిన వాగ్దానాలు విస్మరించబడ్డాయి. తన కుమారుడిని ప్రోత్సహిస్తూ ఒక వైపు మితవాదులను [illegible], మరో వైపు అతివాద శక్తులను దెబ్బతీయటానికి ప్రధాన మంత్రి శ్రీమతి గాంధీ ప్రయత్నించారు. రాజ్యాంగ వ్యతిరేక అధికార యంత్రాంగం సృష్టించబడింది.

కమ్యూనిస్టుపార్టీ దీనినితీవ్రంగా వ్యతిరేకించింది. అందుకే కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ప్రారంభమయింది.

అభివృద్ధి నిరోధకులు పైకి రావాలనుకుంటున్న దశలో, కమ్యూనిస్టు పార్టీతో మైత్రికోరేవారిని, సామ్రాజ్యవాద వ్యతిరేకులు ప్రజాతంత్రవాదులస్థానంలో అభివృద్ధినిరోధకులు తమ స్థానాలను పదిలం చేసుకోవాలనుకుంటున్న దశలో శ్రీ జగ్జీవన్‌రామ్ ప్రభృతులు కాంగ్రెసు నుండి వెలుపలికి వచ్చి దేశానికి, కాంగ్రెసుకు మేలు చేశారు.

జనతాపార్టీ అధికారంలోకి వస్తే యీ దేశంలో ఏమైనా మంచిపనులు జరిగివుంటే వాటిని దెబ్బతీస్తుంది. సోషలిస్టు దేశాలతో మైత్రి, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం గల మన విదేశాంగ విధానాన్ని తిరగదోడతారు. ప్రభుత్వ రంగం విస్తరణ, బొగ్గు, ఉక్కు, నూనె రంగాల జాతీయకరణ లాంటి మంచిపనులు దెబ్బతింటాయి.

ప్రభుత్వ రంగాన్ని విస్తరించబోమని జనతాపార్టీ తన ఎన్నికల ప్రణాళికలోనే పేర్కొన్నది. అధికారంలోకి వస్తే సామ్రాజ్యవాదుల ఒడిలో మనదేశాన్ని నిలుపుతారు.

"జనతాపార్టీకి జనసంఘ్ యిరుసు లాంటిది. దాని ప్రభావంలోనే అది నడుస్తుంది. ఒక్కసారి గతచరిత్ర గుర్తు చేసుకోండి. వేర్పాటు ఉద్యమంలో ప్రజాతంత్ర హక్కులు ఏ విధంగా కాపాడబడ్డాయి? బీహారు ఉద్యమం ఎలాటిది? ఇతరులు కనీసం బహిరంగసభలు జరుపుకొనటానికి తమ అభిప్రాయాలు చెప్పటానికి అంగీకరించలేక పాశవిక, ఫాసిస్టు చర్యలకు పూనుకున్న ఆ శక్తులతో కూడిన జనతాపార్టీ ప్రజాతంత్ర హక్కులను కాపాడుతుందా? ఇలాంటి జనతాపార్టీ ఎట్టి పరిస్థితులలోనూ అధికారంలోకి రాకూడదు.

అసలు బాట

దేశ ప్రయోజనాలను, నిజమైన ప్రజాతంత్ర హక్కులను కాపాడేది కమ్యూనిస్టు పార్టీ, ప్రజాతంత్రశక్తులు మాత్రమేనని వివిధ ఉద్యమాల సందర్భంగా రుజువయింది. దేశానికి నేడు కావలసింది అభ్యుదయ విధానాలతో ప్రజాతంత్ర హక్కులు కాపాడగల అభ్యర్థులు. ఈ అభ్యర్థులు ఎంత పెద్దసంఖ్యలో గెలుపొందితే దేశ ప్రయోజనాలు అంతగా కాపాడబడుతాయి.

కమ్యూనిస్టుపార్టీ దేశంలో దాదాపు 90 స్థానాలలో పోటీచేస్తున్నది

ఈ అభ్యర్థులను గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను ఇతర స్థానాలలో వివిధ పార్టీలలోవున్న అతివాదులను గెలిపించాలి. ఒక పార్టీగా జనతాపార్టీ ఓడిపోవటం అవసరం ఇదే విధానంతో కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తున్నది.

ఎన్నికల సర్దుబాట్లు

కమ్యూనిస్టుపార్టీ యిదే లక్ష్యంతో సూత్రబద్ధంగా ఎన్నికల సర్దుబాట్లు చేసుకుంటున్నది దామాషా ఎన్నికల పద్ధతి లేకపోవటం చాలా హానికరంగా వుంది. సంక్లిష్ట స్థితిలో నిక్కచ్చిగా గిరులు గీయలేము కొన్ని రాష్ట్రాలలో కమ్యూనిస్టు వ్యతిరేకులు అధికంగా వున్న కాంగ్రెసుతో సూత్రప్రాయంగా ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవడంలేదు. కాంగ్రెసులో నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా నిలిచినపశ్చిమబెంగాల్ కాంగ్రెసుతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకుంటున్నది. కేరళలో కనీస కార్యక్రమానికి కట్టుబడి, దానిని సమర్థవంతంగా అమలు చేస్తున్న పార్టీలతో సర్దుబాట్లు చేసుకుంటున్నది

మార్క్సిస్టుపార్టీతో ఎన్నికల సర్దుబాట్లకు కమ్యూనిస్టుపార్టీ చిత్తశుద్ధితో ప్రయత్నించింది. కేరళ, పశ్చిమబెంగాల్‌లలో వైఖరి కారణంగా మొత్తంగా కుదరదని మార్క్సిస్టు పార్టీ చెపుతున్నది. కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో ఎవరివైఖరివల్ల ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందో యోచించాలి. ఇతర అతివాద, ప్రజాస్వామ్య పార్టీలను విచ్ఛిన్నంచేసి కేవలం తమ పార్టీ మెజారిటీతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలన్న సంకుచిత దృష్టితో మార్క్సిస్టు పార్టీ వ్యవహరించడంవల్లనే ప్రస్తుత స్థితి ఏర్పడింది. ఇతర చోట్ల సర్దుబాట్లు జరిగితే అది భవిష్యత్తులో కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యతకు దోహద పడవచ్చు కదా?

ఏ పార్టీ అధికారంలోకివస్తే దేశానికి అత్యంత ప్రమాదకరమో ఆ జనతా పార్టీతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకుంటున్నది. సీట్ల కోసం అనుసరిస్తున్న అవకాశవాదమా? లేక మరొకటా? ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సర్దుబాట్లకోసం కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నించింది. అయితే వారు ఆసక్తి చూపలేదు.

విజయవాడ

మార్క్సిస్టుపార్టీ యిపుడు విజయవాడ నియోజకవర్గంలో పోటీ పెట్టింది రాజకీయ కేంద్రమైనందున పోటీ పెట్టామని ప్రకటించింది 1971లో యిది రాజకీయ కేంద్రం కాదా? 1971 లో ఆ పార్టీకి గుంటూరు రాజకీయ కేంద్రమైంది. మా నాయకులు శ్రీ శ్రీకృష్ణపై ఆ పార్టీ కార్యదర్శి శ్రీ హనుమంతరావును నుంచో పెట్టారు. తమకే ఎక్కువ ఓట్లు వున్నాయని చర్చలలో పట్టుబట్టారు. కాని ఎన్నికలలో వాస్తవం బయటపడింది. లక్ష ఓట్లున్నాయని చెప్పుకున్న ఆ పార్టీకి 29 వేల ఓట్లు వచ్చాయి. నేడు తిరిగి విజయవాడలో నిలబెట్టింది. ఇది ఎంతహాస్యాస్పదం? ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రతిష్ఠాకరంగా వుండే విజయవాడలో విజయావకాశాలు గల కమ్యూనిస్టు అభ్యర్థికే ఓటు వేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ టి. పోతరాజు సభకు అధ్యక్షతవహించారు. రాష్ట్ర కమ్యూనిస్టుసమితి కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ యం. వి. యస్. కపర్ది, రాష్ట్ర కమ్యూనిస్టుసమితి కార్యదర్శివర్గ సభ్యులు విజయవాడ నియోజకవర్గ అభ్యర్థి శ్రీ దాసరి నాగభూషణరావులు ప్రసంగించారు. శ్రీ దాసరిఅరుణపతాకాన్ని ఆవిష్కరించారు రాష్ట్రకమ్యూనిస్టుసమితి కార్యవర్గ సభ్యులు శ్రీ ఖాస సుధాకరరెడ్డి వేదిక నలంకరించారు. నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్ శ్రీ జె. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి ఆహ్వానం పలికారు.

ఇంద్రజిత్, హిరేన్‌ముఖర్జీ ప్రభృతుల నామినేషన్లు

కలకత్తా, ఫిబ్రవరి 16

పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిస్టు అభ్యర్థులు శ్రీయుతులు ఇంద్రజిత్‌గుప్తా డమ్‌డమ్ లోక్‌సభ నియోజక వర్గానికి, డాక్టర్ రణేన్ సేన్ బారసాత్ నియోజక వర్గానికి, ప్రొఫెసర్ హిరేన్‌ముఖర్జీ కలకత్తా ఈశాన్య నియోజక వర్గానికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

మార్క్సిస్టుపార్టీ నాయకులు శ్రీయుతులు జ్యోతిర్మయిబాసు డైమండ్ హార్బర్ నియోజకవర్గానికి సోమనాథ్‌చటర్జీ జాదవ్‌పూర్ నియోజకవర్గానికి, వి. రేణుహాలిదాస్ కృష్ణనగర్‌కు, శ్రీమతి బీనా ఘోష్ గోస్వామి నవదీప్ (ఎస్. సి)కు తమ నామినేషన్‌లు దాఖలు చేశారు.

పశ్చిమబెంగాల్‌లో ఈ రోజు 25 మంది నామినేషన్‌లు దాఖలుచేశారు. వీటితో మొత్తం నామినేషను పత్రాల సంఖ్య 35కు చేరుకుంది.

కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ పశ్చిమ బెంగాల్ శాఖ అధ్యక్షులు శ్రీ విజయసింగ్ నహార్ కలకత్తా వాయవ్య నియోజకవర్గానికి, కమ్యూనిస్టు అభ్యర్థి మహమ్మద్ ఇలియాస్ జాదవ్‌పూర్‌కు నామినేషన్‌లు దాఖలు చేశారు.

రద్దయిన లోక్‌సభలో కమ్యూనిస్టుపక్ష ఉపనాయకులు శ్రీ సర్జూ దేశ్‌పాండే గాజీపూర్ (యు. పి.) నియోజక వర్గానికి నామినేషన్ దాఖలు చేశారు.

మాజీ రక్షణ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ తిరిగి జలంధర్ (పంజాబ్ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేశారు.

అదే నియోజకవర్గానికి అకాలీదళ్ అభ్యర్థిగా ఇక్బాల్‌సింగ్‌ధిల్లాన్ నామినేషన్ దాఖలు చేశారు.

బీహార్, హర్యానాల్లో

బీహారీ జనతాపార్టీ నాయకులు శ్రీ కర్పూరీ ఠాకూర్ సమస్తిపూర్ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేశారు రాష్ట్రంలో గత ఆరు రోజులుగా మొత్తం 68 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు.

హర్యానాలో లోక్‌సభ స్థానాల సంఖ్య 10 కాగా, నిన్నటికి మొత్తం 45 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు.

రక్షణ మంత్రి శ్రీ బన్సీలాల్ భివాని నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో హర్యానా మాజీమంత్రి శ్రీమతి చంద్రావతి పోటీ చేస్తున్నారు.

హిమాచల్‌ప్రదేశ్

హిమాచల్‌ప్రదేశ్‌లో నిన్న నామినేషన్లు దాఖలు చేసిన వారిలో పౌర విమాన యాన డిప్యూటీ మంత్రి శ్రీ వీరభద్ర సింగ్ వున్నారు.

రాష్ట్రంలోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలకు ఇప్పటికి మొత్తం 12 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు.

అన్ని నియోజక వర్గాలకు కాంగ్రెసు పోటీ చేస్తున్నది,

గుజరాత్

నిన్న గుజరాత్‌లో నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన మొత్తం 39 మంది అభ్యర్థులలో కేంద్ర గృహ నిర్మాణ మంత్రి శ్రీ హితేంద్ర దేశాయ్ ఆయనతో పోటీ చేసే శ్రీ పీలూమోడీ (జనతా) వున్నారు.

నేటికి మొత్తం నామినేషన్ దాఖలుచేసిన వారి సంఖ్య 80 కి పెరిగింది,

శ్రీ హితేంద్ర దేశాయ్, శ్రీ పీలూమోడీ గోధ్రా నియోజక వర్గానికి పోటీ చేస్తున్నారు.

యు. పి.

ఉత్తరప్రదేశ్‌లో పెట్రోలియం రసాయనాల మంత్రి శ్రీ కె. డి మాలవ్యా ఉక్కు-గనుల మంత్రి శ్రీ చంద్రజిత్ యాదవ్ కేంద్ర ఆర్థిక శాఖ డిప్యూటీ మంత్రి శ్రీమతి సుశీల రోహత్గీ ప్రభృతులు నిన్న నామినేషన్ దాఖలు చేశారు రాష్ట్రంలో ఇప్పటికి మొత్తం 10 మంది నామినేషన్లు దాఖలు చేశారు యు. పి. లో 85 లోక్‌సభ స్థానాలున్నాయి.

మొత్తం ఓటర్ల సంఖ్య 5 కోట్ల 18 లక్షలు

కాశ్మీర్—రాజస్థాన్

జమ్మూ-కాశ్మీర్‌లో నిన్నటికి మొత్తం 9 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు రాజస్థాన్‌లోని 22 లోక్‌సభ నియోజకవర్గాలకు మొత్తం 71 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

త్రిపుర

త్రిపుర ఆహారశాఖమంత్రి శ్రీ మోహన్ దాస్‌గుప్తా త్రిపుర పశ్చిమ నియోజకవర్గానికి, మార్క్సిస్టు అభ్యర్థి శ్రీ నృపేంద్ర చక్రవర్తి అదే నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేశారు.

మధ్యప్రదేశ్

మధ్యప్రదేశ్‌లో నిన్న నామినేషన్ దాఖలు చేసిన వారిలో కేంద్ర సమాచార, రేడియోశాఖ మంత్రి శ్రీ వి సి శుక్లా వున్నారు. ఇప్పటికి మొత్తం 68 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

మిర్యాలగూడలో రామచంద్రారెడ్డి పోటీ

ప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 16

నల్గొండజిల్లాలోని మిర్యాలగూడ లోక్‌సభ నియోజకవర్గం నుండి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ కె. రామచంద్రారెడ్డి పోటీ చేస్తారు

ఈ మేరకు ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి నేడు నిర్ణయం తీసుకున్నది.

మరో రెండు సీట్లకు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థుల ప్రకటన

బీహారులో

పాట్నా, ఫిబ్రవరి 16

బీహారులో మరో రెండు పార్లమెంటరీ నియోజక వర్గాలకు రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ నిన్న అభ్యర్థులను ప్రకటించింది. దీనితో మొత్తం 10 స్థానాలకు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను ప్రకటించింది.

బక్సర్ నియోజకవర్గానికి శాసనమండలి సభ్యులు శ్రీ సూరజ్ ప్రసాద్ పేరును ప్రకటించింది. ఈ నియోజకవర్గం నుండి కేంద్ర పౌర సరఫరాల మంత్రి శ్రీ ఎ. పి. శర్మ పోటీ చేస్తున్నారు. పూర్ణియా నియోజకవర్గానికి అమీరుల్ హసన్ పేరును ప్రకటించింది. ఈ నియోజకవర్గం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీమతి మాధురీ సింగ్ పోటీ చేస్తున్నారు,

భాగ్‌పేట నుండి చరణ్‌సింగ్ పోటీ

లక్నో, ఫిబ్రవరి 16

ఉత్తరప్రదేశ్‌లోని భాగ్‌పేట పార్లమెంటరీ నియోజక వర్గం నుండి జనతాపార్టీ ఉపాధ్యక్షులు శ్రీ చరణ్‌సింగ్ పోటీ చేస్తారు.

రాష్ట్రంలోని 85 పార్లమెంటరీ నియోజక వర్గాలలో పోటీ చేసే జనతా పార్టీ అభ్యర్థుల జాబితాను నిన్న ఇక్కడ విడుదల చేశారు

శ్రీ రాజ్‌నారాయణ్ రాయ్‌బరేలీ నియోజక వర్గం నుండి, రవీంద్రప్రతాప్‌సింగ్ అమేథి నియోజక వర్గం నుండి, నానాజీదేశ్‌ముఖ్ బల్‌రామ్‌పూర్ నుండి, చంద్రశేఖర్ బాలియా నుండి, రామ్‌ధన్ లాల్‌గంజ్‌నుండి, జ్ఞానేశ్వర్‌మిశ్రా అలహాబాద్ నుండి, డాక్టర్ సుశీలానయ్యర్ ఝాన్సీ నుండి, మనోహర్‌లాల్ కాన్పూరు నుండి చంద్రశేఖర్‌సింగ్ వారణాసి నుండి, ఓంప్రకాశ్‌త్యాగి బారిచ్ నుండి పోటీ చేయనున్నారు.

బుల్‌డోజర్లతో కార్మిక పాకలు నేలమట్టం

విశాఖపట్నంలో 2 వేల మంది కార్మికులు నివసిస్తున్న ఇసుకపల్లి ప్రాంతంలో బీభత్సకాండ

(విశాలాంధ్ర విలేకరి)

విశాఖపట్నం, ఫిబ్రవరి 16

రెండు వేల మంది ప్రయివేటు, పారిశ్రామిక కార్మికులు నివసిస్తున్న ఇసుకపల్లిదిబ్బ (కాల్టెక్సు కొత్తగేటు దగ్గర) ప్రాంతం పాకల తొలగింపు పేరుతో బీభత్సంగా తయారైంది.

ఈ నెల 14న నావెల్ అధికారులు బుల్‌డోజర్లతో పాకలను తొలగించింది, వాటికి నిప్పు పెట్టారు. అడ్డు వచ్చిన స్త్రీ పురుషులను కొట్టారు.

8 సంవత్సరాలుగా యీ కార్మికులు యిక్కడ కాపురం వుంటున్నారు. వీరిలో ఆంధ్రులు, ఆంధ్రేతరులు కూడా వున్నారు.

ఈ బీభత్సకాండలో భయపడి సుమారు వెయ్యిమంది కార్మికులు స్త్రీలు, పురుషులు వృద్ధులతో సహా ఊరేగింపుగా కలెక్టరు కార్యాలయానికి వెళ్ళారు.

అనంతపురం జిల్లాలో 8 రోజుల నిరశనల ముగింపు

అనంతపురం, ఫిబ్రవరి 16

రాయలసీమ ప్రాంతంలో కరువుసహాయక పథకాలు డిమాండ్ చేస్తూ 8 రోజులుగా జరిపిన నిరాహార దీక్షలు నిన్న ముగిసాయి.

అనంతపురంలోని 19 మంది మహిళలు నిరాహార దీక్ష జరిపారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు శ్రీమతి బి పార్వతమ్మ కార్యదర్శి రాధిక కార్యవర్గ సభ్యురాలు వి. రాజేశ్వరి ఈ దళానికి నాయకత్వం వహించారు.

ఉరవకొండలో నిన్నటి నిరాహారదీక్షలో స్వాతంత్ర్య పోరాటయోధులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని తాలూకాలలో నిన్న నిరాహారదీక్షలు ముగిశాయి. (వి. వి)

ప్రజాస్వామ్య ముసుగులో అరాచక శక్తులు : శ్రీ చావన్ హెచ్చరిక

కుంజే (సతారాజిల్లా), ఫిబ్రవరి 16

జనతాపార్టీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాకపోగా పాత "మహత్తరకూటమి"కి మారు పేరని విదేశాంగశాఖ మంత్రి శ్రీ వై. బి. చావన్ అన్నారు.

ఈ కూటమిలోని నాలుగు పార్టీలకు పరస్పర విరుద్ధ లక్ష్యాలున్న విషయం భారత ప్రజలు అర్థం చేసుకోగలరని సతారా జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగింపు సందర్భంగా జరిగిన ఎన్నికల సభలో నిన్న ఆయన అన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థను కూలదోసి అరాచకం సృష్టించడానికి యత్నించిన ఈ శక్తులే యిప్పుడు ప్రజాస్వామ్య ముసుగు ధరించాయన్నారు

ప్రధాని శ్రీమతి గాంధీ నియంత అన్న ఆరోపణ అక్రమమన్నారు. పాత వ్యవస్థ మాటున ప్రగతిశీల చర్యలను వ్యతిరేకించిన కొద్దిమంది సంపన్నుల రోజులు వెళ్ళిపోయాయన్నారు సవరించిన రాజ్యాంగం గ్రామీణులకు మంచి అవకాశాలిస్తుందన్నారు.

రెండు తలల వికృత శిశువు

కర్ణాటకలో ఏర్పడిన ప్రజాస్వామ్య కాంగ్రెస్ "రెండు తలల వికృత శిశువు" అని ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ ఉర్స్ నిన్న బెంగుళూరులో అన్నారు.

శాసనమండలి సభ్యులు శ్రీ డి. రాజగోపాల్ నాయకత్వాన ఏడుగురు కాంగ్రెస్ లెజిస్లేటర్లు మొన్న రాజీనామా ఇవ్వడం, అంతకుముందు మాజీ మంత్రి శ్రీ రాచయ్య కాంగ్రెసుకు స్వస్తి చెప్పడంపై ఆయన వ్యాఖ్యానించారు గత నాలుగున్నర సంవత్సరాలుగా వీరంతా అసమ్మతి వర్గీయులేనని వారి నిష్క్రమణవల్ల ఎన్నికలలో కాంగ్రెస్ అవకాశాలేమీ దెబ్బతినబోవని చెప్పారు.

బ్రహ్మానందరెడ్డి, రఘురామయ్య, నీలం, పెండేకంటిచే నామినేషన్లు

[విశాలాంధ్ర విలేకరి]

గుంటూరు, ఫిబ్రవరి 16

నర్సరావుపేట నియోజకవర్గం నుండి పోటీ చేయటానికి కేంద్ర హోంమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, గుంటూరు నియోజకవర్గం నుండి పోటీ చేయటానికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ కె. రఘురామయ్యలు నేడిక్కడ నామినేషన్లు దాఖలు చేశారు.

ఈ రోజు ఉదయం 11-15 లకు శ్రీ బ్రహ్మానందరెడ్డి నర్సరావుపేట డిప్యూటీ కమర్షియల్ టాక్సు ఆఫీసరు, రిటర్నింగ్ ఆఫీసరుఅయిన శ్రీ తివారీ ఎదుటనామినేషన్ దాఖలు చేశారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి వెంట రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శ్రీ చేబ్రోలు హనుమయ్య, పి సి.సి. ఉపాధ్యక్షులు శ్రీ పుతుంబాక శ్రీరాములు, కోస్తా జిల్లాల అభివృద్ధి బోర్డు అధ్యక్షురాలు శ్రీమతి బి. జయప్రద, రద్దయినపార్లమెంటుసభ్యులుమద్దిసుదర్శనం, రాజ్యసభసభ్యులు వెనిగళ్ళ సత్యనారాయణ, శాసనసభ్యులు శ్రీయుతులు పీటర్ పాల్, జూలకంటి నాగిరెడ్డి, శ్రీ కాసు కృష్ణారెడ్డి వున్నారు.

ఉదయం 11 42 గంటలకు శ్రీ రఘురామయ్య ఆర్. డి. ఓ రిటర్నింగ్ ఆఫీసరు శ్రీ జె. ఎస్. శర్మ ఎదుట నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు.

శ్రీయుతులు హాజీసులేమాన్‌ఖాన్ తెల్లాకుల వెంకటేశ్వరరావు. అడపా చినవెంకటస్వామి ఆయన పేరును ప్రతిపాదించారు. శ్రీయుతులు జాగాని సుబ్బారావు, ఎం. ఎ. హుస్సేన్‌లు డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ దాఖలు చేసిన అనంతరం శ్రీ రఘురామయ్య దేవుని పేరిట ప్రమాణ స్వీకారం చేశారు.

అంతకు ముందు జిల్లాహరిజన కాంగ్రెస్ కార్యాలయం నుండి పెద్ద ప్రదర్శనతో శ్రీ రఘురామయ్య కలెక్టరు కార్యాలయానికి వచ్చారు. ప్రదర్శనకు శ్రీయుతులు చేబ్రోలు రామయ్య, నక్కా త్రి రామయ్యలు నాయకత్వం వహించారు

శ్రీ రఘురామయ్య వెంట ఎడ్లపాటి వెంకటరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఉన్నవ చినయ్య, శ్రీమతి విజయ రామానుజం, డాక్టర్ బి. రామసీత, గోలుసు కొండలరావు, ఎం. ఇన్నయ్యలు వున్నారు.

శ్రీ రఘురామయ్య కలెక్టర్ కార్యాలయానికి రాకముందే వ్యాపార వర్గాలవారు, యితరులు కార్లలో కలెక్టరు కార్యాలయానికి చేరుకున్నారు.

గుంటూరు నియోజకవర్గంనుండి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీచేయటానికి శ్రీయుతులు చేను అంజనేయులు[ఎడ్లపాడు] బలివర్ధపాత్రుని శ్రీనివాసురావులు నామినేషన్‌లు దాఖలు చేశారు.

విజయవాడనుండి ప్రజాస్వామ్య కాంగ్రెసు అభ్యర్థి

విజయవాడ, ఫిబ్రవరి 16

విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి విజయవాడ న్యాయవాది వై. వి. హనుమంతరావును నిలబెట్టాలని ప్రజాస్వామ్య కాంగ్రెసు రాష్ట్ర కమిటి నిర్ణయించింది. రేపు ఆయన నామినేషన్ వేస్తారు

నీలం, పెండేకంటిల నామినేషన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 16

నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గం నుండి పోటీ చేయటానికి జనతాపార్టీ నాయకులు శ్రీ నీలం సంజీవరెడ్డి నేటి ఉదయం నామినేషన్ దాఖలు చేశారు.

ఇదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ పెండేకంటి వెంకటసుబ్బయ్య (రద్దయిన లోక్‌సభ సభ్యులు) కూడా నేడు నామినేషన్ వేశారు.

శ్రీ సి. సుబ్రహ్మణ్యం నామినేషన్ దాఖలు

మద్రాసు, ఫిబ్రవరి 16

మదురై జిల్లా పళని పార్లమెంటరీ నియోజకవర్గంనుండి పోటీచేయటానికి కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం నేడు తన నామినేషన్‌ను దాఖలు చేశారు.

పళనికి చెందిన శ్రీ లక్ష్మణస్వామి ఆయన పేరును ప్రతిపాదించారు మాజీ శాసనసభ్యులు శ్రీ సేనాపతి గౌండర్ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు

డ్రాగా ముగియనున్న అయిదవ టెస్ట్

బొంబాయి, ఫిబ్రవరి 16

భారత ఎం. సి. సి. జట్ల మధ్య ఇక్కడ జరుగుతున్న చివరి టెస్ట్-డ్రాగా ముగిసే అవకాశం వుంది. నేడు నాలుగు గంటలకు అందిన వార్తల ప్రకారం ఎం. సి. సి. జట్టు రెండవ ఇన్నింగ్‌లో 4 వికెట్ల నష్టానికి 12 పరుగులు చేసింది. అంతకుముందు భారత జట్టు రెండవ ఇన్నింగ్‌లో 191 పరుగులకు ఆలౌట్ అయింది ఎం. సి. సి. జట్టు గెలవాలంటే ఇంకా 80 పరుగులు చేయవలసి వుంది.

రాజస్థాన్ తాత్కాలిక గవర్నర్‌గా శ్రీ త్యాగి

జైపూర్, ఫిబ్రవరి 16

రాజస్థాన్ తాత్కాలిక గవర్నర్‌గా రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధానన్యాయమూర్తి శ్రీ వేద్‌పాల్‌త్యాగి నిన్న మధ్యాహ్నం రాజభవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి శ్రీ వి. సి. పేన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

జనతాపార్టీ - ప్రజాస్వామ్య కాంగ్రెస్ చర్చల ప్రతిష్టంభన

హైదరాబాదు, ఫిబ్రవరి 15

జనతాపార్టీ, ప్రజాస్వామ్య కాంగ్రెస్‌ల సీట్ల సర్దుబాట్లలో ప్రతిష్టంభన ఏర్పడింది.

ప్రజాస్వామ్య కాంగ్రెస్ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షులు శ్రీ ఎ. శ్రీరాములు నేటి సాయంత్రం పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని జనతాపార్టీ, ప్రజాస్వామ్య కాంగ్రెస్‌ల కేంద్ర నాయకత్వానికి వివరించడానికై ఈరోజు సాయంత్రం పార్టీ అధ్యక్షులు శ్రీ కొండా లక్ష్మణ్ ఢిల్లీ వెళ్ళి రేపు ఉదయం నగరానికి చేరుకుంటారని వెల్లడించారు.

ప్రజాస్వామ్య కాంగ్రెస్ పోటీ చేయడానికి నిర్ణయించుకున్న 12 స్థానాలలో అభ్యర్థుల జాబితాను కూడ అధిష్టాన వర్గానికి శ్రీ కొండా లక్ష్మణ్ అందచేస్తారని తెలిపారు.

నల్గొండ స్థానానికి కూడా ప్రజాస్వామ్య కాంగ్రెస్ పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు శ్రీ శ్రీరాములు ప్రకటించారు

సీట్ల సర్దుబాటు విషయమై తాము సి.పి.ఐ తో సంప్రదింపులు ప్రారంభించామని వెల్లడించారు.

జనతాపార్టీతో చర్చలు జరిగిన అనంతరం ప్రజాస్వామ్య కాంగ్రెసు కార్యవర్గం సమావేశమై పై నిర్ణయాలకు వచ్చింది.

ప్రజాస్వామ్య కాంగ్రెసు పత్రికా సమావేశంలో వెల్లడించిన కార్యవర్గ నిర్ణయాలను తెలుసుకున్న జనతాపార్టీ నాయకులు మరి కొన్ని స్థానాలలో అభ్యర్థుల పేర్లను ప్రకటించారు

పార్వతీపురం - సత్యప్రసాద్ తోట రాజు, నల్గొండ - యం. జగన్‌మోహన్ రెడ్డి, భద్రాచలం - శ్రీమతి వాణీ రమణారావు (ప్రజాస్వామ్య కాంగ్రెసు) నాగర్ కర్నూల్ - పి రాధాకృష్ణ (ప్రజాస్వామ్య కాంగ్రెసు), సిద్ధిపేట - అశోక్ (ప్రజాస్వామ్య కాంగ్రెసు) పేర్లను జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు.

నల్గొండ స్థానాన్ని ప్రజాస్వామ్యకాంగ్రెసుకి వదిలివేస్తామని జనతాపార్టీ నాయకులు నిన్న జరిగిన చర్చల సందర్భంగా వెల్లడించిన నిర్ణయానికి ఈ ప్రకటన పూర్తి విరుద్ధంగా వుందని ప్రజాస్వామ్య కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కొండా లక్ష్మణ్ అన్నారు.

ఏది ఏమైనా ప్రజాస్వామ్య కాంగ్రెస్ పోటీచేయ నిర్ణయించుకున్న స్థానాలలో విరమించుకునే సమస్య ఉత్పన్నం కాదని నాయకులు ప్రకటించారు.

మరోవైపు జనతాపార్టీ నాయకులు ప్రజాస్వామ్య కాంగ్రెస్‌కు అయిదు స్థానాలను యిప్పటికే వదిలివేశాం. మరో స్థానాన్ని (అదిలాబాద్) అధికంగా యిచ్చే ప్రశ్న ఉదయించదనే అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. జనతా పార్టీ తుది నిర్ణయం మద్రాసు వెళ్ళిన శ్రీ సంజీవరెడ్డి రేపు ఉదయం నగరానికి చేరుకోగానే వెల్లడిస్తామని తెలియ చేశారు

కమ్యూనిస్టు పార్టీతో సర్దుబాట్లపై ఎం. జి. ఆర్. వివరణ

మద్రాసు ఫిబ్రవరి 15

కమ్యూనిస్టుపార్టీ మూడు సీట్లలో పోటీ చేయటానికి అంగీకరించినట్లయితే, ఆ పార్టీతో సర్దుబాట్లకు తమ పార్టీ ఇప్పటికీ సిద్ధంగా వుందని, అఖిలభారత అన్నా డి. ఎం. కె. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. జి రామచంద్రన్ నిన్న ఇక్కడ తెలియజేశారు.

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తూ ఆయన పై విధంగా చెప్పారు.

రద్దయిన లోక్‌సభలో కమ్యూనిస్టుపార్టీకి గల నాలుగు స్థానాలను కమ్యూనిస్టుపార్టీకి కేటాయించేందుకు అఖిల భారత అన్నా డి ఎం కె హామీ యిచ్చిందని రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎం కళ్యాణసుందరం చేసిన ప్రకటనను శ్రీ రామచంద్రన్ తిరస్కరించారు.

సీట్ల సర్దుబాటుపై కాంగ్రెసుతో చర్చలు జరపటానికి తాను ఢిల్లీకి వెళ్ళే ముందు శ్రీ కళ్యాణసుందరం తనను కలుసుకున్నపుడు, ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన తరువాత మాత్రమే సీట్ల విషయంపై తాను ఏవిషయమైనా చెప్పగలనని చెప్పానని అన్నారు. లోక్‌సభలో తమకుగల నాలుగు స్థానాలు యిస్తారా అని అన్న శ్రీ కళ్యాణ సుందరం అడిగారని, ఢిల్లీ చర్చల ఫలితంకోసం వేచివుండమని మాత్రమే తాను చెప్పానని అన్నారు.

కమ్యూనిస్టుపార్టీతో సీట్ల సర్దుబాటు విషయంలో తమ పార్టీలో విభేదాలు వున్నందున మూడు స్థానాలకే సర్దుకోవలసిందిగా ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన అనంతరం శ్రీ కళ్యాణసుందరాన్ని తానుకోరాననిఅన్నారు అంతేకాక తిరునల్వేలి నియోజకవర్గంనుండి కమ్యూనిస్టు పార్టీ పోటీ చేయరాదనికూడా తాను సూచించానని చెప్పారు.

ఒక సీటులో ప్రతిపక్షాలు గెలవటానికి అవకాశం కల్పించినా అది విచ్ఛిన్నకర శక్తులు బలపడటానికి తోడ్పడుతుందనితాను తెలిపానని అన్నారు.

తరువాత రెండు పార్టీల మధ్య జరిగిన చర్చలలో మూడు స్థానాలు యివ్వగలమని చెప్పామని అన్నారు అయితే శ్రీ కళ్యాణ సుందరం నాలుగు స్థానాలకు తమపార్టీ అభ్యర్థులను ప్రకటించారని, అదే సమయంలో సర్దుబాటుకు సిద్ధంగా వున్నామని ప్రకటించారని ఆయన ప్రశ్నలను అర్థంచేసుకోలేక పోతున్నానని చెప్పారు

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీని అధికారంనుండి తొలగించాలన్న ఏకైక లక్ష్యంతోనే కొన్ని ప్రతిపక్షాలు ఏకమైనాయని అన్నారు. అత్యవసరపరిస్థితికాలంలో ధరలు తగ్గుతున్న విషయాన్ని వాస్తవాన్ని ఈ పార్టీలు తిరస్కరించగలవా అన్నారు శ్రీ యుతులు జయప్రకాష్‌నారాయణ్ మొరార్జీ దేశాయ్ వంటి నాయకులు ఈ విషయాన్ని పరిశీలించాలని అన్నారు

అభ్యర్థుల జాబితా

లోక్‌సభ ఎన్నికలలో పోటీచేసే 20మంది అభ్యర్థుల జాబితాను అఖిలభారత అన్నా డి ఎం కె నిన్న ఇక్కడ విడుదల చేసింది

ఉత్తరమద్రాసు శ్రీనంబిల్, శ్రీపెరుంబుదూర్ శ్రీ కె మనోహరన్, చెంగల్‌పట్ శ్రీ జగన్నాథన్, వాండీవాష్ శ్రీ ఆర్ మోహనరంగం, తిరుపత్తూర్ శ్రీ సి. వేణుగోపాల్, కృష్ణగిరి శ్రీ పి యస్. విశ్వనాథ్, సేలం శ్రీ పొయ్యాస్వామి, తిరుచెంగోడు శ్రీ పి కన్నన్, పొలాచి శ్రీఆర్ కులందైవేల్, నీలగిరి శ్రీ కె ఎ రాజు, దిండిగల్, శ్రీ పి యస్ రామలింగం, పెరియకులం శ్రీ కె మాయాథేవర్, తిరునల్వేలి శ్రీ ఎస్ రామస్వామి రామనాథపురం శ్రీ అల్లాడి అరుణ, శివగంగ శ్రీ పి అంబాళగన్ పుదుక్కోటై శ్రీ పి. త్యాగరాజన్ పెరంబలూర్ శ్రీ ఎ యస్ ఇలంగోవియన్, తంజావూర్ శ్రీ అశోక్ రాజ్ చిదంబరం శ్రీ యస్. డి. సోమసుందరం పుదుచ్చేరి శ్రీ మురుగేశన్, వంజనూర్ శ్రీ బాల.

ఎన్నికల ప్రణాళిక ప్రకటన

మద్రాసు ఫిబ్రవరి 15

రాష్ట్రాల పూర్తి తోడ్పాటుతో బలమైన కేంద్రంకోసం తమపార్టీ కృషి చేస్తుందని అఖిలభారత అన్నాడి ఎం కె తన ఎన్నికల ప్రణాళికలో హామీ యిచ్చింది

దేశ సంక్షేమంకోసం ఉద్దేశింపబడిన స్పష్టమైన నిర్దిష్టమైన ప్రగతిశీల విధానాల ఆధారంగా బలమైన సుస్థిరమైన కేంద్రం అవసరమని తెలిపింది విధానాలు, సూత్రాల ప్రాతిపదికగా ఏర్పడిన ప్రగతిశీల సంఘటన ఈ లక్ష్యాన్ని గుర్తించడం అవసరమని పేర్కొంది.

ఫెడరల్ వ్యవస్థలో ఐక్యతను సాధించటానికి పార్టీ కృషి చేయగలదని, ఈ లక్ష్య సాధనకుగాను రాజ్యాంగంలో మార్పులకు కృషి చేయగలదని తెలిపింది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, మాతృభాషకు గుర్తింపు, మంచి పరిపాలనా యంత్రాంగం ఏర్పాటుకు కృషి చేయగలదని తెలిపింది

సమతా సమాజాన్ని, సెక్యులర్ సమాజాన్ని ఏర్పాటుచేయటానికి పార్టీ కృషి చేస్తుందని తెలిపింది.

ఎన్నికల ప్రచారసభలో పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీ కె మనోహరన్ గత రాత్రి తమ ప్రణాళికను విడుదలచేశారు.

మితవాదశక్తుల ప్రయత్నాలను భగ్నం చేయటానికిగాను ప్రగతిశీలపార్టీల ఐక్యతకు పార్టీ కృషి చేయగలదని తెలిపింది.

వెనుకబడిన రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయటానికి కృషి జరగాలని తెలిపింది. భాషా మతపరమైన మైనారిటీల జీవనప్రమాణాల మెరుగుదలకు సౌకర్యాలు కల్పించాలని కోరింది.

18 సంవత్సరాలకే ఓటుహక్కు సాధించటానికి ఓటర్ల విశ్వాసం కోల్పోయిన ప్రజా ప్రతినిధులను వెనక్కు రప్పించేహక్కు ప్రజలకు కల్పించేందుకు కృషి చేయగలదని తెలిపింది.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి రాజ్యాంగాన్ని సవరించేందుకు కృషి చేయగలమని పేర్కొన్నది.

భాషా సమస్యపై జవహర్‌లాల్ నెహ్రూ యిచ్చిన హామీలకు రాజ్యాంగపరమైన హామీని సాధించేందుకు కృషి చేయగలదని, అన్నాదురై రూపొందించిన ద్విభాషా సూత్రాన్ని బలపరచగలదని తెలిపింది.

ఏవైనా కారణాలతో రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసినపుడు లేదా మెజారిటీ కోల్పోయి రాష్ట్ర ప్రభుత్వాలు కూలిపోయినపుడు అటువంటి రాష్ట్రాలలో వెంటనే ఎన్నికలు జరపాలని కోరింది. ఎన్నికల తరువాతకూడా సుస్థిర ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేకపోతే అప్పుడు రాష్ట్రపతి పాలన విధించాలని కోరింది.

మౌలికపరిశ్రమలు ప్రభుత్వరంగంలోనే వుండాలని తెలిపింది పెద్ద పెద్ద పరిశ్రమలను దశలవారీగా జాతీయం చేయాలన్నది వ్యవసాయ దారులతో సంప్రదించి వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించటం జరుగుతుందని తెలిపింది.

షెడ్యూల్డు కులాలు, తరగతుల వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్న విధానానికి పార్టీ కట్టుబడి వుందని తెలిపింది.

టి.వి. రాఘవులు రాజీనామా

హైదరాబాదు ఫిబ్రవరి 15

ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి శ్రీ టి. వి రాఘవులు, శాసనమండలి మాజీ సభ్యురాలు శ్రీమతి వాణీ రమణారావు నేడు కాంగ్రెసుకు రాజీనామాచేసి ప్రజాస్వామ్య కాంగ్రెసులో చేరినట్లు ప్రకటించారు.

ఓరియంటల్ స్కూళ్ల టీచర్ల పదవీ విరమణ కాలం పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 14

ఓరియంటల్ స్కూళ్ళలోను, కాలేజీలలోను పనిచేయు టీచర్లు 55 ఏండ్లకు మించి 60 ఏండ్లు వరకు పనిచేయడానికి ప్రభుత్వం అనుమతిస్తూ నేడు ఉత్తర్వులు జారీచేసిందని ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు శ్రీయుతులు డి శివరామరాజు యం బాలకృష్ణమ్మ, యం. జె మాణిక్యారావు ఒక ప్రకటనలో తెలిపారు.

55 ఏండ్ల తరువాత కాలాన్ని పునర్ నియామకంగా చూడటం జరుగుతున్నది.

విద్యా కమిషన్ సిఫార్సులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకొన్న ఈచర్యను వారు అభినందించారు

అయితే 55 ఏండ్ల తరువాత కాలాన్ని పునర్ నియామకంగా చూడకుండా, పదవీ విరమణ కాలాన్ని 60 ఏండ్లకు పెంచాలని ఇదే విధమైన ప్రయోజనాన్ని స్కూళ్ళలోను, కాలేజీల్లోను పనిచేసే టీచర్లకుకూడా విస్తరింప చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

1,14,419 మందికి స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14

స్వాతంత్ర్యసమరయోధుల పెన్షన్‌క్రింద అందిన 2,43,759 దరఖాస్తుల్లో1977 జనవరి వరకు 1,14,419 దరఖాస్తులు మంజూరు చేయబడ్డాయి.

ఇంతవరకు 2,43 572 దరఖాస్తులు పరిష్కరించబడ్డాయి 87 968 దరఖాస్తులు తిరస్కరించబడి 41,180 దరఖాస్తులు ఫైలు చేయబడ్డాయి.

11,497 మంది ఐ ఎన్. ఎ. ఉద్యోగులకు పెన్షన్ లభిస్తున్నదని, ఇందులో 12,46 మందిసైనిక ఉద్యోగులు, 1,833 పౌర ఉద్యోగులు వున్నారని అధికార ప్రకటనలో తెలుపబడింది.

స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పథకం 1972 లో భారత స్వాతంత్ర్య రజతోత్సవ సంవత్సరం సందర్భంగా ప్రవేశపెట్టబడింది.

పోలింగ్ బందోబస్తుపై ఐ. జి. పి. వివరణ

హైదరాబాదు, ఫిబ్రవరి 15

రానున్న ఎన్నికల సందర్భంగా పోలీసు బందోబస్తుకు సంబంధించి విజయవాడలో తాను చేసిన ప్రకటనను వివరిస్తూ ఐ జి పి శ్రీ కె రామచంద్రారెడ్డి నేడొక ప్రకటనను ఇక్కడ విడుదల చేశారు. ప్రకటనలో క్రింది విధంగా వుంది

1977 మార్చిలో జరగనున్న ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల బందోబస్తు ఏర్పాటు చేయటానికి తగినంతమంది పోలీసులు లేనందున పోలింగ్ బందోబస్తుకు హోంగార్డులు, ఎక్సైజ్, అటవీశాఖలకు చెందిన సిబ్బంది సహాయం తీసుకొనడం జరుగుతుంది.

కొన్ని పత్రికలలో వచ్చినట్లుగా (విశాలాంధ్ర కాదు) వారిని పోలీసు స్టేషన్లవద్ద గస్తీకి వినియోగించడం జరగదు.

హోంగార్డులు, ఎక్సైజ్, అటవీశాఖ సిబ్బందిని పోలీసు స్టేషన్ల గస్తీకి వినియోగించడం జరుగుతుందని తాను చెప్పలేదని ఆయన తెలియజేశారు.

భారత్-అమెరికా వాణిజ్య మండలి సంయుక్త సమావేశం

వాషింగ్‌టన్, ఫిబ్రవరి 15

భారత్ అమెరికా వాణిజ్య మండలి సంయుక్త సమావేశం నేడిక్కడ ప్రారంభమైంది.

భారత్-అమెరికా సంబంధాలలో మండలి కార్యకలాపాలకు ఎంతో ప్రాధాన్యతవుందని అమెరికా అధ్యక్షులు జిమ్మికార్టర్ సమావేశానికి పంపిన సందేశంలో తెలియజేశారు.

మండలి సంయుక్త అధ్యక్షులయిన అరి కెసహారిమన్ ద్వారా కార్టర్ తన సందేశాన్ని పంపారు. సమావేశంలో పాల్గొంటున్న భారత ప్రతినిధులకు శుభాకాంక్షలను తెలియజేస్తూ సమావేశం విజయవంతం కావాలన్న ఆకాంక్షను కార్టర్ వ్యక్తం చేశారు.

మెక్సికన్ అధ్యక్షుని పర్యటనకారణంగా కార్యక్రమాల వత్తిడి లేకపోయినట్లయితే భారత ప్రతినిధివర్గ సభ్యులను కలుసుకొని వుండేవాడినని తెలిపారు.

సమావేశంలో హారిమన్‌కార్టర్ సందేశాన్ని భారత ప్రతినిధివర్గానికి అందజేశారు.

అమెరికాలో ఈ సమావేశం జరగటం ఇదే ప్రథమం.

భారత ప్రతినిధివర్గంలో భారత వాణిజ్య పారిశ్రామిక మండలుల సమాఖ్య అధ్యక్షులు శ్రీ ఎం వి. అరుణాచలం, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ కె ఎస్. మోడి, భారత అమెరికా వాణిజ్యమండలి అధ్యక్షులు శ్రీ టి. టి. వాసు, తదితరులు వున్నారు.

సమావేశంలో భారత రాయబారి శ్రీ కేవల్ సింగ్ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారానికి ప్రతినిధి వర్గం కృషిచేయగలదని అన్నారు.

శ్రీలంక ఫ్రీడమ్‌పార్టీకి మరో ఎం. పి. రాజీనామా

కొలంబో, ఫిబ్రవరి 15

శ్రీమతి సిరిమావో బండారునాయకే నాయకత్వానగల శ్రీలంక ఫ్రీడమ్ పార్టీకి మరో పార్లమెంటు సభ్యులు నిన్న రాజీనామా చేశారు దీనితో పార్టీని ఫిరాయించిన పార్లమెంటు సభ్యుల సంఖ్య [illegible] పెరిగింది.

ఇల్లెందు తా॥లో కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల ప్రచార కమిటీ ఏర్పాటు

ఖమ్మం ఫిబ్రవరి 15

ఖమ్మంజిల్లా ఇల్లెందులో ఈనెల 11 న వివిధ గ్రామాల కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు 200 మంది శ్రీ కప్పల వేలాద్రి అధ్యక్షతన సమావేశమై 71 మందితో తాలూకా ఎన్నికల కమిటీని ఏర్పాటుచేశారు.

ఎన్నికల ప్రచారాన్ని గురించి శ్రీవేలాద్రి వివరించారు. ఎన్నికల ఖర్చుకుగాను పార్టీ సానుభూతి పరులు శ్రీ అమీరుద్దీన్ రు 116 విరాళంగా యిచ్చారు.

భద్రాచలం డివిజన్‌లో రు. 12½ వేల పార్టీనిధి

ఖమ్మం, ఫిబ్రవరి 15

ఈ నెల 14 న భద్రాచలంలో పార్టీ సభ్యుల, సానుభూతిపరుల సమావేశం శ్రీ బి. భూపతిరావు అధ్యక్షతన జరిగింది.

డివిజన్ పార్టీ కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాసరావు పార్టీ విరాళాలకు విజ్ఞప్తి చేసిన వెంటనే ఇప్పటివరకు వసూలుచేసిన నిధి భద్రాచలం పట్టణంనుంచి కార్యదర్శి శ్రీ రావు రు. 5 వేలు, పురుషోత్తంపట్నం నుండి శ్రీ గోపిరెడ్డి రు. 2 వేలు, భూనవరం వసూలు శ్రీ జి. సుబ్రహ్మణ్యం ద్వారా రు 2 వేలు, గౌరిదేవిపేట ప్రాంతం వసూలు శ్రీ కందుకూరు సుబ్బారావు ద్వారా రు. 3 వేలు, చిల్లరగా రు 500మొత్తం రు.12,500 జిల్లాపార్టీ కార్యదర్శి శ్రీ పి నాగేశ్వరరావుకు సమర్పించగా మరో రు. 20 వేలు వాగ్దానాలు చేశారు.

దేశ రాజకీయ పరిస్థితులను గురించి, ఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు. (వి. వి.)

రక్షణ నిబంధనల క్రింద కేసులు ఉపసంహరణ

ఉత్తరప్రదేశ్‌లో

లక్నో ఫిబ్రవరి 15

రక్షణ నిబంధనల క్రింద పెండింగులో ప్రాసిక్యూషన్ కేసులను ఉపసంహరించడానికై ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మొన్న ఉత్తర్వులు జారీ చేసింది.

3801 మంది వ్యక్తులకు సంబంధించిన 14 వేల కేసులు ఉపసంహరించబడతాయని అధికార ప్రతినిధి ఒకరు తెల్పారు వీరు ఇప్పటికే బెయిల్ మీద విడుదల చేయబడ్డారు.

కేసులు ఉపసంహరించబడిన వారిని వెంటనే విడుదల చేయాలని జిల్లా మేజిస్ట్రేట్లకు ఆదేశాలు పంపడం జరిగింది.

శ్రీ స్వామినాథన్ పర్యటన

బొంబాయి, ఫిబ్రవరి 15

లోక్‌సభకు జరిగే ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలో నిర్వహణ కార్యక్రమాలు చాలా సంతృప్తికరంగా వున్నాయని, మంచి నిర్మాణయుతంగా వున్నాయని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ టి. స్వామినాథన్ తెలియచేశారు.

ఆయన ఇక్కడ పత్రికా సమావేశంలో ప్రసంగిస్తూ చాలాకాలం నుండి వస్తున్న సాంప్రదాయం యీసారి విఫలమయ్యేందుకు కారణం కనిపించలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జరిపే ఏర్పాట్లను స్వయంగా పరిశీలించేందుకు బయలుదేరిన శ్రీ స్వామినాథన్ ప్రథమంగా బొంబాయికి వచ్చారు.

ప్రతిపక్షాల ప్రతినిధులు ఆయనను కలుసుకొని ఎన్నికల విధానంపై కొంత వివరణ అవసరమని చెప్పారు. ఆయన ఈరోజు కేరళకు బయలుదేరి వెళతారు. కేరళ పర్యటన అనంతరం తమిళనాడు కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో పర్యటిస్తారు.

ఢిల్లీ చేరుకుని తిరిగి ఆయన పర్యటన కొనసాగిస్తారు.

యు. పి, గుజరాత్, పశ్చిమ బెంగాల్, అస్సాం, బీహార్, రాజస్థాన్, హర్యానా, చండీఘర్, రాష్ట్రాలలో పర్యటిస్తారు మార్చి 10వ తేదీకి ఆయన పర్యటన ముగుస్తుంది,

నూతన లోక్‌సభ నోటిఫికేషన్ మార్చి 22 లేక 23వ తేదీన జారీ చేయబడుతుందని అంచనా.

అన్ని పార్టీల ప్రతినిధులతో నిఘాకమిటీ వేస్తారా అని ప్రశ్నించగా అటువంటి కమిటీలు అవసరం లేదన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బెంగుళూరు, ఫిబ్రవరి 14

కర్నాటక లెజిస్లేటివ్ కౌన్సిల్ సిండికేట్ సభ్యులు శ్రీ యుతులు బి ఎ. దొడ్డశెట్టి, వి. ఎ కట్టిల కాంగ్రెసులో చేరినట్లు కె పి సి. సి. అధ్యక్షులు శ్రీ యస్. బి. నగరాల్ నిన్న యిక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

చరణ్‌సింగ్‌పై యు. పి మార్క్సిస్టు పార్టీ నాయకుని విమర్శ

లక్నో, ఫిబ్రవరి 15

ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలకు జనతాపార్టీ అభ్యర్థులను పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ చరణ్‌సింగ్ ఏకపక్షంగా ప్రకటించారని, మార్క్సిస్టుపార్టీతో సీట్లు సర్దుబాటును ఆయన తిరస్కరిస్తున్నారని ఉత్తరప్రదేశ్ మార్క్సిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ శంకర్ దయాళ్‌తివారి నిన్న ఒక పత్రికా ప్రకటనలో విమర్శించారు

దీన్నిబట్టి చూచినట్లయితే కాంగ్రెస్ వ్యతిరేక ఓట్ల చీలికను నివారించటానికి శ్రీ చరణ్‌సింగ్‌కు ఆసక్తివున్నట్లు తోచటం లేదని అన్నారు.

"ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న శక్తుల ఐక్యత నిమిత్తం పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీ తనకు బలమైన స్థానాలను (రద్దయిన ప్రస్తుత లోక్‌సభ మార్క్సిస్టుపార్టీ సభ్యుల స్థానాలు,కూడా త్యాగం చేశామని, అటువంటి మా పార్టీతో కూడా సర్దుబాట్లు చేసుకొనేందుకు శ్రీ చరణ్‌సింగ్ తిరస్కరిస్తున్నారని" అన్నారు.

శ్రీ చరణ్‌సింగ్ ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించటాన్నిబట్టి చూచినట్లయితే, రాష్ట్రంలో ఇతర పార్టీలనన్నింటిని త్రోసిపుచ్చి, జనతాపార్టీ పేరుతో పాత బి ఎల్. డి గుత్తాధిపత్యాన్ని సాధించేందుకు ఆయన యత్నిస్తున్నట్లు తోస్తున్నదని శ్రీ తివారి తెలిపారు.

తమపార్టీఅమెరోహ్, సుల్తానాపూర్, అక్బర్‌పూర్ ఘోషీ లాల్‌గంజ్, వారణాసి బాదా, మణిపురి, కైరానా నియోజకవర్గాలలో పోటీ చేయగలదని అన్నారు.మరి కొన్ని స్థానాలలో పోటీ చేసే విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

బీహార్‌లో జనతాపార్టీతో మాత్రమే పొత్తు

పాట్నా, ఫిబ్రవరి 15

బీహార్‌లో జనతాపార్టీతోమాత్రమే పొత్తు పెట్టుకుంటామని, కమ్యూనిస్టు పార్టీతో ఎలాంటి సర్దుబాట్లు చేసుకోబోమని రాష్ట్ర మార్క్సిస్టుపార్టీ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ రామానందసింగ్ నిన్న తెలియజేశారు.

రాష్ట్రంలో కమ్యూనిస్టుపార్టీ,మార్క్సిస్టు పార్టీలు కమ్యూనిస్టు ఓట్ల చీలికను నివారించేందుకు అంగీకరించినట్లు పత్రికలలోవచ్చిన వార్తలపై వ్యాఖ్యానిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

యం. టెక్ పరీక్షలో రామమోహనరావుకు ప్రథమ స్థానం

హైదరాబాదు, ఫిబ్రవరి 14

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (హైదరాబాదు) నిర్వహించిన యం. టెక్ (సెమిస్టర్) పరీక్షలో ఎ పి.ఎస్. ఆర్ టి.సి, అసిస్టెంటు వర్క్సు మేనేజరు శ్రీ ఎం. రామమోహన్‌రావు ప్రథమునిగా ఉత్తీర్ణ అయ్యారు.

కమ్యూనిస్టు పార్టీ నుండి తొలగింపు

అనకాపల్లి, ఫిబ్రవరి 15

అనకాపల్లి తాలూకా నాగులపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ కె. నాగేశ్వరరావును పంచాయతీ నిధులను దుర్వినియోగ పరచినందుకుగాను కమ్యూనిస్టు పార్టీ నుండి తొలగించటం జరిగింది.

శ్రీ నాగేశ్వరరావుపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు తాలూకా కమ్యూనిస్టు సమితి ఒక కమిషన్‌ను నియమించింది. సర్పంచ్ పదవిని మరో కామ్రేడ్‌కు అప్పగించవలసిందిగా కమిషన్ చేసిన నిర్ణయాన్ని వుల్లంఘించినందున శ్రీ నాగేశ్వరరావు పార్టీ నుండి తొలగించబడ్డారు.

కడలూరు, ఫిబ్రవరి 15

దక్షిణ ఆర్కాట్‌జిల్లా ఉళుందూర్‌పేట వద్ద నిన్న జరిగిన లారీ ప్రమాదంలో నలుగురు మరణించారు. 20 మందికి గాయాలు తగిలాయి. మదురై నుండి 120 మంది అఖిలభారత అన్నా డి యం. కె కార్యకర్తలు రెండు లారీలలో మద్రాసుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

వరంగల్, హన్మకొండ డిపోలలో ఆర్. టి. సి. కార్మికుల ప్రదర్శన

వరంగల్, ఫిబ్రవరి 15

ఎ. పి. ఎస్. ఆర్. టి సి. ఎంప్లాయీస్ కేంద్ర యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 10 న వరంగల్, హన్మకొండ డిపోల కార్మికులు బ్యాడ్జీలు ధరించి ప్రదర్శన జరిపారు.

ప్రదర్శనకు వరంగల్ బ్రాంచి యూనియన్ కార్యదర్శి శ్రీ ఎం డి బేగ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ ఎ ఎల్. ఖాన్‌లు నాయకత్వం వహించారు.

ప్రదర్శన అనంతరం వరంగల్ బ్రాంచి యూనియన్ అధ్యక్షులు శ్రీ చక్రపాణి కార్మికుల నుద్దేశించి ప్రసంగిస్తూ పోటీ యూనియన్ దుష్ప్రచారాన్ని ఖండించారు పోటీ యూనియన్ చెప్పే కల్లబొల్లి మాటలకు కొందరు స్వార్థపరులు [illegible] అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని వారిపట్ల కార్మికులు మెలకువగా వుండాలని విజ్ఞప్తి చేశారు.

వేతన స్కేళ్ల, అపరిష్కృతంగా వున్న సమస్యలపై యాజమాన్యంతో నాయకులు చర్చలు జరుపుతున్నారని, సర్వీసు వెయిటేజీ, డి. ఎ. బకాయిల చెల్లింపు సమస్యల పరిష్కారానికై జరుగుతున్న చర్చల సందర్భంగా కార్మికులు సమైక్యంగా వ్యవహరించాలని వెరిఫికేషన్ సమయంలో ఎంప్లాయీస్ యూనియన్‌కు ఓటుచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు.

ఢిల్లీలో ఆదివారం జరిగిన రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ అంతిమయాత్ర దృశ్యం.

రాయ్‌బరేలీ నుంచి ఇందిరాగాంధీ, అమేథి నుంచి సంజయ్‌గాంధీ పోటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి, ఆమె రెండవ కుమారుడు శ్రీ సంజయ్‌గాంధీ సుల్తాన్‌పూర్ జిల్లాలోని అమేథీ నుంచి లోక్‌సభకు పోటీచేస్తున్నారు.

శ్రీమతి ఇందిరాగాంధీ ఈనెల 17 న రాయ్‌బరేలీలో నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ఉదయం ఢిల్లీ నుండి బయలుదేరి వెళ్ళి, రాయ్‌బరేలీలో కొద్దిసేపు ఆగి, అక్కడ నుండి దుసాతి వెళ్ళి బహిరంగసభలో ప్రసంగించివచ్చి రాయ్‌బరేలీలో నామినేషన్ దాఖలు చేస్తారు.

సాయంత్రం ఢిల్లీ తిరిగి వచ్చేలోపు సాకాన్, ఖిరాన్, పూరపాండే, దారిమౌ, జగత్‌పూర్‌లలో బహిరంగసభల్లో ప్రసంగిస్తారు.

తేక్‌గాంలో శ్రీమతి గాంధీ కళాశాలకు శంఖుస్థాపన చేస్తారు.

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం నేడు ఉత్తర ప్రదేశ్ నుంచి పోటీచేసే అభ్యర్థిని ఎంపిక చేసింది.

ఇప్పుడు శ్రీ సంజయ్ గాంధీ పోటీచేసే అమేథి 1967లో పార్లమెంటరీ నియోజకవర్గంగా ఏర్పడింది. 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ వి. డి. వాజ్‌పాయ్ జనసంఘ్‌పై దాదాపు నాలుగువేల ఓట్ల మెజారిటీతో గెలిచారు

అప్పుడు శ్రీ వాజ్‌పాయ్‌కి 35 81శాతం, జనసంఘ్ అభ్యర్థి శ్రీ ప్రసాద్‌కి 33.74 శాతం ఓట్లు వచ్చాయి.

1971 లో తిరిగి శ్రీ వాజ్‌పాయ్ 62 713 శాతం ఓట్లు సాధించి గెలుపొందారు జనసంఘ్ అభ్యర్థికి 13,76 శాతం ఓట్లు వచ్చాయి.

1967లో ఆరుగురు, 1971లో ఐదుగురు అభ్యర్థులు పోటీచేశారు.

84 స్థానాలకు అభ్యర్థుల నిర్ణయం

ఉత్తరప్రదేశ్‌లోని 85 లోక్‌సభ స్థానాలకుగాను 84 స్థానాలకు తమ అభ్యర్థుల్ని కాంగ్రెస్ కేంద్రఎన్నికల సంఘం నేడు ఎంపిక చేసింది. ఒక్కఫిరోజాబాద్(ఎస్.సి) స్థానానికి అభ్యర్థిని నిర్ణయించవలసి వుంది

రాజస్థాన్ గవర్నరుగా నిన్న రాజీనామా చేసిన శ్రీ జోగీందర్‌సింగ్‌కు బహరాంచ సీటు ఇచ్చారు.

కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి శ్రీ కె డి. మాలవీయ దొమరియాగంజ్ నుంచి తిరిగి పోటీ చేస్తారు.

ఏడుగురు కేంద్ర స్టేట్‌మంత్రులు, ఐదుగురు కేంద్ర డిప్యూటీ మంత్రులు తిరిగిపోటీ చేస్తున్నారు స్టేట్ మంత్రులు: కె. సి. పంత్ (నైనిటాల్), చంద్రజిత్ యాదవ్ (ఆజాంగఢ్), బి. పి. మౌర్య (హాపూర్), విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ (అలహాబాద్), షానవాజ్‌ఖాన్ (మీరట్), సురేంద్రపాల్ సింగ్ (బులందషహర్), చందూరీరామ్ సేవక్ (జలేసర్).

డిప్యూటీ మంత్రులు: బాల గోవింద వర్మ (ఖేరి), జియావుర్ రెహమాన్‌అన్సారీ (ఉన్నావ్), కేదార్‌నాథ్ సింగ్ (సుల్తాన్‌పూర్), శ్రీమతి సుశీలారోహతగి (బిల్‌హౌర్), సుఖదేవ్ ప్రసాద్ (బన్స్‌గామ్) ప్రస్తుతం శ్రీ ప్రసాద్ రాజ్యసభ సభ్యులు రద్దయిన సభలో శ్రీ మహరాజ్ ప్రసాద్ ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు.

84 మంది అభ్యర్థుల జాబితాలో రద్దయిన లోక్‌సభలోని సభ్యులు 67 మంది వున్నారు. ఉత్తరప్రదేశ్ శాసన సభలోని యిద్దరు కాంగ్రెసు సభ్యులను కూడా లోక్‌సభ అభ్యర్థులుగా ఎంపిక చేశారు.

శాసనసభ్యులు శ్రీ సత్తార్ అహ్మద్ అన్సారి అమ్రోహా నుండి పోటీ చేస్తారు. 1971 లో యిక్కడి నుండి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి శ్రీ మౌలానా ఇషాక్ శంభాలి ఎన్నికయ్యారు.

రద్దయిన లోక్‌సభలో కమ్యూనిస్టు పార్టీ ప్రాతినిధ్యం వహించిన అయిదు స్థానాలు — కాన్పూర్, ఘోసి, ఘాజీపూర్, అమ్రోహా, ముజఫర నగర్‌లలో ఈసారి కాంగ్రెస్ తన అభ్యర్థులను నిలబెడుతుంది.

రద్దయిన లోక్‌సభలో కమ్యూనిస్టు నాయకులు శ్రీ ఎస్ ఎం. బెనర్జీ కాన్పూర్‌కు, శ్రీ విజయపాల్‌సింగ్ ముజఫర్‌నగర్‌కు, ఇషాక్ శంబాలి అమ్రోహాకు, జార్ఖండ్‌రాయ్ ఘోసి నియోజక వర్గానికి, శ్రీ సర్జుపాండే ఘాజీపూర్‌కు ప్రాతినిధ్యం వహించిన విషయం పాఠకులకు విదితమే.

మాజీ కేంద్ర మంత్రి శ్రీ దినేష్‌సింగు ప్రతాప్‌ఘర్ నుండి, అజీజ్ యిమామ్ మీర్జాపూర్ నుండి, సంత్‌బక్షసింగు ఫతేపూర్‌నుండి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తారు.

వారణాసి జిల్లాలో చంద్రౌలి నుండి పోటీ చేసేందుకు రాష్ట్ర మంత్రి శ్రీ లోక్‌పాటి త్రిపాఠీ భార్య కేంద్ర మంత్రి కమలాపతి త్రిపాఠి కోడలు శ్రీమతి చంద్రా త్రిపాఠిని ఎంపిక చేశారు.

భగత్ నియోజకవర్గం నుండి జనతా పార్టీ నాయకుడు చరణ్ సింగ్‌తో పోటీ చేసేందుకు శ్రీ రామచంద్రవికల్‌ను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేసింది.

ఫిర్యాదుల పరిశీలనకు అఖిలపక్ష కమిటీలు

రాష్ట్రాలకు ఎన్నికల సంఘం సూచన

తిరువనంతపురం, ఫిబ్రవరి 15

ఎన్నికలప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించేందుకు జిల్లాలలో వివిధపార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చునని రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికల సంఘం సూచించింది,

ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి శ్రీటి.స్వామినాథన్ నేడిక్కడ తెలియచేశారు.

రాష్ట్రాలు కావాలనుకుంటే యీ విధంగా అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేయవచ్చునని తాను సూచించానని విలేకరులతో మాట్లాడుతూ ఆయన చెప్పారు

ఎన్నికల ఏర్పాట్లను తనిఖీచేసే పర్యటనలో భాగంగా యీరోజు ఇక్కడకు శ్రీ స్వామినాథన్ వచ్చారు అటువంటి అఖిలపక్ష కమిటీలకు జిల్లా కలెక్టర్లు కన్వీనర్లుగా వుంటారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులు వుంటారు. ఈ కమిటీలను ఏర్పాటు చేసే విషయాన్ని రాష్ట్రాలకు వదిలివేయటం జరిగిందని తెల్పారు.

ఇటువంటి కమిటీలను కేరళలో ఏర్పాటు చేయటం జరిగిందని ఆయన చెప్పారు.

కొన్ని అంశాలనులేవనెత్తుతూ మార్క్సిస్టు పార్టీ నాయకులు శ్రీ సంబూద్రిపాద్ రాసిన లేఖకు సమాధానమిచ్చానని శ్రీస్వామినాథన్ అన్నారు.

పోలింగ్ బూత్ వద్దనే ఓట్ల లెక్కింపు జరగాలనే సూచన ఎన్నికల కమిషన్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు.

కేరళలో ఎన్నికల ఏర్పాట్లు చాలా చురుకుగా జరుగుతున్నాయని, ఒక ప్రణాళిక ప్రకారం అన్నీ సక్రమంగా సాగిపోతున్నవని అన్నారు.

చండీఘర్‌నుండి షీలాదీది పోటీ

చండీఘర్, ఫిబ్రవరి 15

కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘర్ లోక్‌సభ నియోజకవర్గంనుండి పోటీచేసేందుకు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా పంజాబ్ మహిళా సంఘం ఉపాధ్యక్షులు శ్రీమతి షీలా దీదీ నేడు నామినేషన్ దాఖలు చేశారు,

ఈ నియోజకవర్గంనుండి పోటీ చేసేందుకు యిప్పటికి ఎనిమిది మంది నామినేషన్లు వేశారు.

నామినేషన్లు వేసిన వారిలో జనతాపార్టీ అభ్యర్థి శ్రీ కృష్ణకాంత్ కాంగ్రెసు పార్టీ సభ్యులు శ్రీ సత్‌పాల్ కపూర్ ఉన్నారు వీరుగాక మరో ఐదుగురు ఇండిపెండెంట్లు నామినేషన్లు వేశారు.

అగ్నిప్రమాదంలో నలుగురు మృతి

కలకత్తా, ఫిబ్రవరి 15

నేటి మధ్యాహ్నం యిక్కడి నుండి 10 కిలోమీటర్ల దూరంలో గల కమర్‌హాటిలోని ఒక అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ షెడ్డులో అగ్నిప్రమాదం సంభవించిన ఫలితంగా 4 గురు మృతిచెందారు. మరో 6 గురికి తీవ్రంగా గాయాలు తగిలినట్లు పోలీసులు తెలిపారు.

మంటలను అదుపులోకి తేవడానికి 5అగ్నిమాపక దళాలు యిప్పటికీ తీవ్రంగా కృషి చేస్తున్నాయి. గాయపడినవారిలో 4 గురిని యిక్కడి ఆస్పత్రిలో చేర్చారు.

ఈ నెల 19 లోగా పొగాకు బోర్డు ధరలు అమలు

ఛైర్మన్ శ్రీ మురళీధరరావు హామీ

కొవ్వూరు, ఫిబ్రవరి 15

గుంటూరులో ఈనెల 8 న పొగాకుబోర్డు నిర్ణయించిన ధరలను 19 వ తేదీలోపల అమలు జరిగేటట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందని బోర్డు ఛైర్మన్ శ్రీ యన్. కె. మురళీధరరావు హామీ యిచ్చారు.

పొగాకు బోర్డు నిర్ణయించిన ధరలు పొగాకు కంపెనీలు రైతులకు యివ్వడం లేదని జిల్లా రైతుసంఘం కార్యదర్శి శ్రీదుగ్గిరాల గోపాలకృష్ణ బోర్డు దృష్టికి తీసుకురాగా ఆయన పై హామీ యిచ్చారు.

1 వ గ్రేడ్‌కు క్వింటాలు రు 965, అగ్ మార్క్ 4 గ్రేడుకు రు 1200 బోర్డు ధరలను నిర్ణయించింది

ఉపాధ్యాయుల జాతీయ అవార్డుల పంపిణీ ఉత్సవం వాయిదా

న్యూఢిల్లీ ఫిబ్రవరి 15

ఉపాధ్యాయులకు జాతీయ అవార్డుల పంపిణీ ఉత్సవం వాయిదా వేయబడింది తేదీ తర్వాత నిర్ణయిస్తారు.

ఈ ఉత్సవం యీ నెల 24 న మామూలుగా జరగవలసివుంది

కర్నూల్ ఫిబ్రవరి 15

కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంనుండి పోటీ చేయడానికి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ కె. విజయ భాస్కరరెడ్డి నేడు నామినేషన్ దాఖలు చేశారు.

తమిళనాడులో రెండు సంఘటనల మధ్య పోటీ

మద్రాసు, ఫిబ్రవరి 15

తమిళనాడు ఎన్నికల రంగం నేడు స్పష్టమైన రూపం తీసుకుంది.

కాంగ్రెస్, అన్నా డి యం కె కమ్యూనిస్టు పార్టీలు ఒక సంఘటనగా, జనతాపార్టీ డి. యం. కె. లు మరో సంఘటనగా ఏర్పడ్డాయి

అన్నా డి ఎం. కె. కాంగ్రెస్ ఒప్పందం ప్రకారం అన్నా డి ఎం కె 21 స్థానాలకు కాంగ్రెస్ 15 స్థానాలకు, ముస్లింలీగ్ ఒక స్థానానికి పోటీ చేస్తాయి రద్దయిన లోక్‌సభలో నాలుగు స్థానాలున్న కమ్యూనిస్టుపార్టీ మూడు స్థానాలు కోయంబత్తూరు, నాగపట్నం తిరుచిరాపల్లిలలో మాత్రం పోటీ చేస్తుంది.

జనతాపార్టీ, డి. ఎం. కె ల చర్చల్లో గత వారం ఏర్పడిన ప్రతిష్టంభనను నేడు పరిష్కరించడం జరిగింది ఆ పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం డి ఎం. కె. జనతా పార్టీలుచెరి 18 స్థానాలలో పోటీ చేస్తాయి. మిగిలిన నాలుగు స్థానాలవిషయం రేపు ప్రకటిస్తారని రాష్ట్ర జనతాపార్టీ అధ్యక్షుడు శ్రీ పి. రామచంద్రన్ చెప్పారు.

మిగిలిన నాలుగు స్థానాలు - మదురై, దిండిగల్, ఆర్కోణం, కరూర్‌ల విషయం చర్చలు కొనసాగుతున్నాయని శ్రీ కరుణానిధి చెప్పారు.

మద్రాసు సెంట్రల్‌నుండి గత ఎన్నికలలో గెలుపొందిన డి యం. కె. సభ్యుడు శ్రీ మురసోలి మదన్ ఈ ఎన్నికలలో పోటీచేయనని ప్రకటించారు. ఈ స్థానం నుండి జనతా పార్టీ నాయకుడు పి. రామచంద్రన్ పోటీ చేయవచ్చని భావిస్తున్నారు.

మార్క్సిస్టుపార్టీకి సీట్లు కేటాయించే విషయం గూడా మా దృష్టిలో వుంది అని శ్రీ రామచంద్రన్ ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

కాంగ్రెసుకు ఓఝూ రాజీనామా

అహమ్మదాబాదు, ఫిబ్రవరి 15

గుజరాత్ మాజీముఖ్యమంత్రి శ్రీ ఘనశ్యామ్ ఓఝూ కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసినట్లు నేడొక ప్రకటనలో వెల్లడించారు.

డాల్‌సింగ్ కాంగ్రెస్‌లో చేరిక

బి. యల్. డి నాయకుడు, హర్యానా మాజీ మంత్రి శ్రీ డాల్‌సింగ్ తన 600 మంది కార్యకర్తలతోబాటుగా నేడు కాంగ్రెసులో చేరారు

హర్యానా ముఖ్యమంత్రి శ్రీ బి.డి.గుప్తాతో సమావేశం జరిగిన అనంతరం ఆయన పై ప్రకటన చేశారు

బి. యల్. డితో సంబంధాలు తెగతెంచుకుని తాను కాంగ్రెసులో చేరుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

బీహార్ నుండి ఫెర్నాండెజ్ పోటీ

పాట్నా ఫిబ్రవరి 15

సోషలిస్టు నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ జనతాపార్టీ అభ్యర్థిగా బీహార్‌లోని ముజఫర్‌పూర్‌నుండి లోక్‌సభకు పోటీ చేస్తారని నేడిక్కడ ప్రకటించారు.

బీహార్ నుండి పోటీచేసే 48 మంది జనతాపార్టీ అభ్యర్థుల జాబితాను బి ఎల్ డి నాయకుడు శ్రీ కర్పూరి ఠాకూర్ నేడిక్కడ ఒక పత్రికా గోష్టిలో ప్రకటించారు మిగిలిన ఆరుగురు అభ్యర్థుల పేర్లను రేపు ప్రకటించడం జరుగుతుందని ఆయన చెప్పారు. 48 స్థానాలలో 4 స్థానాలు ప్రజాస్వామ్య కాంగ్రెస్‌కు కేటాయించడం జరిగింది

సిండికేటు మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ రవీంద్రవర్మ రాంచి నుండి పోటీచేస్తారని ఆయన చెప్పారు. పత్రికాగోష్టిలో శ్రీ జయప్రకాష్ నారాయణ్ కొద్ది సేపు పాల్గొన్నారు.

13 అసెంబ్లీ సీట్లకు అభ్యర్థుల ప్రకటన

నేషనల్ ప్రజా సోషలిస్టు పార్టీ చే

తిరువనంతపురం, ఫిబ్రవరి 15

నేషనల్ ప్రజా సోషలిస్టుపార్టీ లోక్‌సభకు 3 మందిని శాసనసభకు 12మంది అభ్యర్థుల జాబితాను నేడు విడుదలచేసింది

కేరళ మాజీ శాసనసభస్పీకర్ పార్టీ నేషనల్ కమిటీ కన్వీనర్ శ్రీ దామోదరన్ పొట్టి తవాయ మంగళం శాసనసభ స్థానానికి మాజీ శాసన సభ్యులు, పార్టీ చైర్మన్ శ్రీ యం అరాకుంజులాల్ చిరాయిన్‌కిల్ లోక్‌సభ సీటుకు పోటీ చేస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలుపబడింది.

కరుణాకరన్ ప్రభృతులు ఢిల్లీ నుండి రాక

కేరళ హోంమంత్రి శ్రీ కె కరుణాకరన్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఎ కె. ఆంటోని, శ్రీ సి యం స్టీఫెన్ ఢిల్లీనుండి నేడు తిరిగి వచ్చారు.

విమానాశ్రయంలో శ్రీ ఆంటోని పత్రికా విలేకరులతో మాట్లాడుతూ మావెలిక్కర నియోజక వర్గంనుండి లోక్‌సభ నియోజక వర్గానికి పోటీచేసే అభ్యర్థి పేరు రేపు ప్రకటించబడుతుందని తెలిపారు.

కాంగ్రెస్‌కు కేటాయించిన 54 శాసనసభ సీట్లలో 51 ఇప్పటికే ప్రకటించడం జరిగిందని, మిగతా 3 సీటకు అభ్యర్థుల పేర్లు నేడు ఢిల్లీలో ప్రకటించబడతాయని ఆయన తెలిపారు.

ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటన వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

వచ్చే లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీనుండి పోటీచేసే కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ప్రకటనను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం రేపటి వరకు వాయిదా వేసింది.

మధ్యప్రదేశ్‌లోని సత్నానుండి శ్రీరామచంద్ర బాజ్‌పాయ్ పోటీ చేస్తారని కమిటీ ప్రకటించింది.

పంజాబ్‌లోని మిగిలిన మూడు నియోజక వర్గాలకు కూడా కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది

సంగ్రూర్ నుండి సర్దార్ రంజిత్‌సింగ్ భటిండా (షె కు.) నుండి సర్దార్ సుర్జీత్ సింగ్, ఫరీద్‌కోట్ నుండి సర్దార్ అవతార్ సింగ్ బరాడ్‌లు పోటీ చేస్తారు.

బొంబాయి నగరంలోని రెండు నియోజక వర్గాలకు యింకా కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాల్సి వుంది.

గోవిందరాయ్ చత్రా కాంగ్రెస్‌లో చేరిక

చండీఘర్, ఫిబ్రవరి 15

రావ్ బీరేంద్ర సింగ్ నాయకత్వాన గల విశాల్ హర్యానా పార్టీ మంత్రి వర్గంలో పార్లమెంటరీ కార్యదర్శి అయిన శ్రీగోవిందరాయ్ చత్రా కాంగ్రెస్‌లో చేరారు.

హిస్సార్ జిల్లా ఫతేబాద్‌లో ఒక బహిరంగసభలో ఆయన ఈ విషయం ప్రకటించారు. సభలో ముఖ్యమంత్రి శ్రీ బి. డి గుప్తా కూడా వున్నారు.

తనతోపాటు 2 వేల మంది మద్దతుదార్లు కూడా కాంగ్రెస్‌లో చేరారని, లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు పూర్తి తోడ్పాటు యిస్తానని ఆయన చెప్పారు.



రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ సంస్మరణార్థం ఢిల్లీలో సోమవారం జరిగిన అఖిలపక్ష బహిరంగసభలో ప్రసంగిస్తున్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి. వేదికపై (కుడినుండి) వరుసగా శ్రీయుతులు జగ్‌జీవన్ రామ్, అశోక్ మెహతా, చంద్ర రాజేశ్వరరావు, బి. డి. జెట్టి, బారువా,

కర్నాటకలో మొత్తం డిటెన్యూల విడుదల

బెంగుళూరు, ఫిబ్రవరి 15

నిషేధింపబడిన సంస్థలకు చెందినవారు మినహా మిగతా డిటెన్యూలందరిని విడుదల చేయటం జరిగిందని కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ ఉర్స్ నేడిక్కడ తెలిపారు.

ప్రధాని పర్యటన

మార్చి మొదటి వారంలో ప్రధానమంత్రి ఇందిరా గాంధి, రాష్ట్రంలో ఎన్నికల పర్యటన జరుపవచ్చునని భావిస్తున్నామని అన్నారు. మంత్రివర్గ సమావేశానంతరం మాట్లాడుతూ ఆయన పై విషయాన్ని తెలియచేశారు.

ఎన్నికల సందర్భంగా మంత్రులు ప్రైవేటు కార్లను మాత్రమే వినియోగిస్తారని, ఈ మేరకు మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. ఎన్నికల ప్రచారాన్నిగురించి మంత్రివర్గం వివరంగా చర్చించిందని చెప్పారు. కాంగ్రెసు అభ్యర్థులకు ప్రచారం చేయుటకు తమతమ జిల్లాలలోనే వుండాలని మంత్రులను కోరటం జరిగిందని అన్నారు.

స్వరణ్‌సింగ్, గోఖలే ప్రభృతుల నామినేషన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

నేడు 6 వ రోజున వివిధ రాష్ట్రాలలో అనేక మంది ప్రముఖులు నామినేషన్లు దాఖలు చేశారు.

వారిలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి హెచ్.ఆర్. గోఖలే. రక్షణ మంత్రి శ్రీ బన్సీలాల్, కేంద్ర గృహ నిర్మాణశాఖ మంత్రి శ్రీ హితేంద్రదేశాయ్, సమాచార శాఖ మంత్రి శ్రీ వి.సి శుక్లా, విదేశ వ్యవహారాల శాఖ మాజీమంత్రి శ్రీ స్వరణ్‌సింగ్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్‌లు వున్నారు.

ఈ రోజు నామినేషన్లు దాఖలు చేసిన కమ్యూనిస్టుపార్టీ ప్రముఖులలో శ్రీయుతులు భోగేంద్ర ఝా (మధుబని బీహార్) కేదార్ దాస్ (జంషెడ్‌పూర్-బీహార్) సర్జూపాండే (ఘాజిపూర్ - యు. పి.) ఝార్ఖండ్‌రాయ్ (ఘోసి. యు.పి.) ఇషాక్ శంభాలీ (అమ్రోహ యు పి.) లోక్‌నాథ్‌చౌదరి (ఒరిస్సా) కె ఎం. మధుకర్ (మోతిహారి - బీహార్) చంద్రశేఖర ప్రసాద్‌సింగ్ (జహానబాద్ - బీహార్) షీలాదత్ (చండీఘర్) లు వున్నారు.

బొంబాయి వాయవ్యంలో గోఖలేతో తలపడనున్న భారత బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ శ్రీ రాం జేఠ్‌మాలని కూడ నేడు నామినేషన్ దాఖలు చేశారు.

గుజరాత్‌లోని గోద్రా నుండి శ్రీ దేశాయ్ శ్రీ మోడీపై పోటీ చేస్తున్నారు. 1971 లో కాంగ్రెస్ అభ్యర్థిపై ముఖాముఖి పోటీలో 14 వేల ఓట్లతేడాతో శ్రీ మోడీ ఆ స్థానాన్ని కైవశం చేసుకున్నారు.

బన్సీలాల్ జనతాపార్టీ అభ్యర్థి శ్రీమతి చంద్రావతితో తలపడనున్నారు.

నామినేషన్‌లు దాఖలు చేసిన యితర ప్రముఖ నాయకులలో బిజూ పట్నాయక్ [జనతా] బిజయ్‌సింగ్ నహర్ [ప్ర.కాం.] ఎరాసెజియన్ [రద్దయినలోక్‌సభలో డి.ఎం.కె గ్రూపు నాయకుడు], హోకోషిసేమా [నాగాలాండ్ మాజీ ముఖ్యమంత్రి] వున్నారు.

పంజాబ్‌లో శ్రీ స్వరణ్‌సింగ్ [జలంధర్ నుండి] పి. సి సి. అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్, మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్, పంజాబ్ జనతాపార్టీయూనిట్ కన్వీనర్ బలదేవ్ ప్రకాశ్, శిరోమణి గురుద్వార్ ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు గురుచరణ్ సింగ్ తోహ్రా, మార్క్సిస్టునాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్‌లు నేడు నామినేషన్‌లు దాఖలు చేశారు.

ఉత్తర ప్రదేశ్‌లో

ఉత్తర ప్రదేశ్‌లో కేంద్ర పెట్రోలియం, రసాయనాల మంత్రి శ్రీ కె. డి. మాలవీయ, ఉక్కు గనుల మంత్రి శ్రీ చంద్రజిత్ యాదవ్, కేంద్ర మాజీమంత్రి శ్రీదినేష్ సింగ్, జనతాపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చంద్రశేఖర్, కేంద్ర పెట్రోలియం డిప్యూటీ మంత్రి జియావుర్ రహమాన్ అన్సారి, కేంద్ర మాజీమంత్రి సుశీలా నాయర్, రాష్ట్ర విధాన సభలో జనసంఘ్ గ్రూపు నాయకుడు యం. పి. త్రిపాఠీ నేడు నామినేషన్లు దాఖలు చేశారు.

రద్దయిన లోక్‌సభలో కమ్యూనిస్టుసభ్యులు శ్రీయుతులు సర్జూపాండే, ఇషాక్ శంభాలి కూడా నేడు నామినేషన్లు దాఖలుచేశారు.

పార్టీలవారీ వేసిన నామినేషన్ల వివరాలు యీ క్రింది విధంగా వున్నాయి

కాంగ్రెస్ - 11 బి. యల్. డి. - 40, కమ్యూనిస్టుపార్టీ - 8, మార్క్సిస్టుపార్టీ 2, ఇండిపెండెంటులు, చిన్నపార్టీలు-69.

కేరళలో

మహారాష్ట్ర స్టేట్ ముస్లింలీగ్ అధ్యక్షుడు శ్రీ జి యం. బనత్‌వాలా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ అధ్యక్షుడు శ్రీ ఇబ్రహీం సులేమాన్ సైత్‌లు వరుసగా యిక్కడి పొన్నాని, మంచేరి లోక్‌సభ నియోజకవర్గాల నుండి నేడు తమ నామినేషన్లు దాఖలు చేశారు.

కేరళ అసెంబ్లీకి మరో 40 మంది నేడు నామినేషన్లు దాఖలుచేయడంతో ఆ సంఖ్య 90 కి పెరిగింది. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ ప్రధాన కార్యదర్శి శ్రీ సి హెచ్. మహమ్మద్ కోయా మలప్పురం నుండి నామినేషన్ దాఖలుచేశారు.

తమిళనాడు

తమిళనాడు నుండి లోక్‌సభకు రద్దయిన లోక్‌సభలో ఇద్దరు డి యం కె. సభ్యులు శ్రీ సి. ఎ. స్వామినాథన్, శ్రీ సి. టి. దండపాణిలు నేడు నామినేషన్లు దాఖలు చేశారు.

స్వామినాథన్ గోబిచెట్టి పాలాయం, దండపాణి పొలాచి (రిజర్వుడు) నియోజక వర్గాలనుండి పోటీచేస్తున్నారు.

మద్రాసు ఉత్తరం, మద్రాసు దక్షిణాల నుండి మరో ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలుచేశారు.

మదురై, రామనాథపురం జిల్లాలలోని పళని, పెరియాకుళం, శివకాశి నుండి ముగ్గురు ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలుచేశారు.

ఎరాసెజియన్ చెంగల్పట్‌నుండి నామినేషన్ దాఖలుచేశారు. వెల్లూరు, వాండివాష్, అర్కోణం నియోజక వర్గాల 6గురు ఇండిపెండెంట్లు విన్న నామినేషన్లు దాఖలు చేశారు.

కర్నాటకలో

కర్నాటకలో నేడు నామినేషన్లు దాఖలు చేసిన ప్రముఖులలో కేంద్ర హోంశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ యఫ్. హెచ్. మొహిసిన్, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ బి శంకరానంద్, జనతాపార్టీ నాయకుడు శ్రీ జగన్నాథరావ్ జోషిలు వున్నారు.

బెంగళూరు జిల్లాలోని బెంగళూరు ఉత్తర నియోజకవర్గంనుండి మరొకఅభ్యర్థి, కనకపురనుండి ముగ్గురు అభ్యర్థులు (అందరూ ఇండి) నామినేషను దాఖలు చేశారు.

బెల్గాం నియోజకవర్గం నుండి ఎ. కె. కొట్రశెట్టి (కాం). పి. బి. పాటిల్ (బి. యల్. డి.), యస్. డి. బెంచన్నవార్, ఎ కె. కులకర్ణి (ఇండి, నామినేషన్లుదాఖలు చేశారు.

మంగుళూరులో ఎ.కె.సుబ్బయ్య (జనతా) మహాబలేశ్వరంభట్ (మా, ఉడిపినుండి వి. యస్. ఆచార్ (జనతా) నామినేషన్లు దాఖలు చేశారు.

కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థుల నామినేషన్

ఢిల్లీలోని రెండు స్థానాల నుండి పోటీ చేస్తున్న కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులు శ్రీ ప్రేమ్‌సాగర్ గుప్తా, శ్రీ బి. డి. జోషిలు యీ రోజు నామినేషను వేశారు.

ఢిల్లీ పార్టీ కార్యదర్శి అయిన శ్రీ ప్రేమసాగర్ గుప్తా ఢిల్లీ సాదర్‌నుండి ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ సభ్యులైన శ్రీ బి. డి. జోషి తూర్పు ఢిల్లీనుండి పోటీ చేస్తున్నారు.

మధ్యప్రదేశ్‌లో 36 మంది జనతాపార్టీ అభ్యర్థుల జాబితా

మధ్యప్రదేశ్ నుండి పోటీచేసే 36 మంది అభ్యర్థుల జాబితాను జనతాపార్టీ నేడు ప్రకటించింది.

ఇక్కడినుండి పోటీచేసే ప్రముఖులలో శ్రీ హెచ్. వి. కామత్, శ్రీ శరద్ యాదవ్, శ్రీ పురుషోత్తమ్ కౌశిక్.

జనతాపార్టీతో ప్రజాస్వామ్య కాంగ్రెసు ఒప్పందం : ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

ఉత్తరప్రదేశ్ లోక్‌సభ స్థానాలకు సంబంధించి ప్రజాస్వామ్య కాంగ్రెసు, జనతా పార్టీల మధ్య అంగీకారం కుదిరింది.

ఈ అంగీకారం ప్రకారం 20 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులు పోటీచేస్తారని ప్రజాస్వామ్య కాంగ్రెసు ప్రతినిధి చెప్పారు. మిగిలిన 15 స్థానాలకు జనతా పార్టీ పోటీ చేస్తుందని బీహార్‌కు సంబంధించి కూడ రెండు పార్టీలు తాత్కాలిక ఒప్పందానికి వచ్చాయని ఆయనన్నారు. ఈ ఒప్పందం ప్రకారం మొత్తం 54 స్థానాలకుగాను 14 స్థానాలలో ప్రజాస్వామ్యకాంగ్రెసు పోటీ చేస్తుందని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏ ఐ సి.సి సభ్యులు శ్రీ యస్ పి. రాణా కాంగ్రెసు పార్టీకి రాజీనామా చేసి తమ పార్టీలో చేరారని ప్రతినిధి అన్నారు.

పార్టీ పోటీ చేసే నియోజక వర్గాలలో గర్వాల్, లక్నో, గోరఖ్‌పూర్ డియోరియా, రాబర్ట్స్‌గంజ్, ఫూల్‌పూర్, పజంపూర్, కన్నౌజ్, బిజ్నూర్, సహరాన్‌పూర్, మిస్రిక్, బారబంకి, పడ్రౌనా, మల్లిషాహర్ చెయిల్, జలాన్, హర్దా, అమ్రోహ, మీరట్, మహరాజ్‌గంజ్ వున్నాయి.

మలేరియా వ్యాధిపై పరిశోధనలకు ప్రత్యేక నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

దేశంలో తిరిగి మలేరియా వ్యాధి పెరుగుతున్నందున దానిపై పరిశోధనలు జరిపేందుకు ప్రత్యేకంగా ఒక కోటి రూపాయలు కేటాయించాలని ప్రభుత్వానికి భారత ఆరోగ్య పరిశోధన మండలి విజ్ఞప్తి చేసింది.

ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తున్నదని పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి గోపాలన్ చెప్పారు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసిన మలేరియా అధ్యయన మండలి అధ్యక్షులైన శ్రీ గోపాలన్ సమాచార్ విలేకరితో మాట్లాడుతూ మలేరియాపై పరిశోధన పథకాలు రూపొందించేందుకుగాను ఎనిమిది అధ్యయన బృందాలు యీ నెల ఆఖరులో సమావేశమవుతున్నాయన్నారు.

ఆగ్నేయాసియా ప్రాంతానికి సంబంధించి మలేరియా నిర్మూలనకు సమన్వయ కార్యక్రమాలను రూపొందించేందుకుగాను ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్నది.

భారతదేశంలో యిటీవల మలేరియా వ్యాధి తిరిగి పెద్దయెత్తున వ్యాపిస్తున్నది. ఈ పెరుగుదల 14 శాతం వరకు వుంది.

భారతదేశంలో మలేరియా పరిస్థితి చాలా తీవ్రంగా వున్నదని ప్రపంచ ఆరోగ్యసంస్థ భావిస్తున్నది. 1971 లో 13 లక్షల కేసులు కనుగొనగా 1975 లో 52 లక్షలకు చేరుకున్నట్లు పరిశోధనలలో తేలింది.

మామూలుగాయిచ్చే మందులకుమలేరియా లొంగటంలేదని శ్రీ గోపాలన్ తెలిపారు. అందువల్ల వీటికొరకు మందులు కనుగొనేందుకు ప్రత్యేక పరిశోధనలు అవసరమయ్యాయని చెప్పారు.

జనతాపార్టీ ప్రజలకు మేలుచేయలేదు

— మురహరి

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఫిబ్రవరి 16

జనతాపార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు మేలుచేయలేదని రాజ్యసభ ఉపాధ్యక్షుడు శ్రీ గౌరీ మురహరి నేడిక్కడ అన్నారు.

విజయవాడ నియోజక వర్గం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ మురహరి ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. జనతాపార్టీ నాయకులు గతంలో మంత్రి పదవులను నిర్వహించినవారేనని, వారు ప్రజలకు ఏ విధంగానూ మేలు చేయ లేకపోయారని అన్నారు.

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి శ్రీ చనుమోలు వెంకట్రావు ప్రసంగిస్తూ శ్రీ మురహరిని గెలిపించాలని కోరారు.

శ్రీమురహరి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన రాజ్యసభ సభ్యులు శ్రీ కె. యల్. యన్. ప్రసాద్ మూడు గంటలపైగా జరిగిన యీ సమావేశంలో ప్రసంగిస్తూ శ్రీ మురహరిని గెలిపించటానికి కాంగ్రెసు కార్యకర్తలందరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశానికి కృష్ణాజిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ బుచ్చిరామయ్యశ్రేష్టి అధ్యక్షత వహించారు శాసనసభ్యులు శ్రీడి రామారావు, శ్రీ వసంత నాగేశ్వరరావు శ్రీమతి వి. రాజ్యలక్ష్మిదేవి, శ్రీ వి భాస్కరరావు, శాసనమండలి సభ్యులు శ్రీ పాలడుగు వెంకట్రావు, శ్రీ జి వెంకటేశ్వర్లు, ప్రభృతులు ప్రసంగించారు.

చెరకు రవాణా రేట్లు సవరింపు

మంత్రి శ్రీ నరసప్ప వెల్లడి

కర్నూలు, ఫిబ్రవరి 15

రాష్ట్రంలో చెరకు ఉత్పత్తిదారులకు లాభం కల్పించేందుకు చెరకుకు రవాణా చార్జీలను సవరించినట్లు రాష్ట్ర చక్కెర పరిశ్రమ, వెనుకబడిన తరగతుల మంత్రి శ్రీ కె. బి. నరసప్ప నేడిక్కడ పత్రికల వారికి చెప్పారు.

సవరించబడిన రేట్ల ప్రకారం ఫ్యాక్టరీ నుండి 10 కి. మీ లోపు టన్నుకు రు. 5, పది కిలో మీటర్ల తర్వాత ప్రతి కిలో మీటరుకు టన్నుకు 25 పైసలు అదనంగా వసూలు చేస్తారని యీ రేట్లు టన్నుకు రు. 10 గరిష్టంగా వుంటుందని ఆయన చెప్పారు.

కడపజిల్లా చెన్నూరులో సహకార చక్కెర ఫ్యాక్టరీ ఫిబ్రవరి 28 న ఉత్పత్తి ప్రారంభిస్తుందని, మిర్యాలగూడా సహకార చక్కెర ఫ్యాక్టరీ ఫిబ్రవరి 23 నుండి ఉత్పత్తి ప్రారంభిస్తుందని ఆయనచెప్పారు.

నంద్యాల సహకార చక్కెర ఫ్యాక్టరీ 1978 అక్టోబరు నుండి ఉత్పత్తి ప్రారంభిస్తుందన్నారు.

వాజ్‌పాయ్‌చే నామినేషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

న్యూఢిల్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసేందుకు జనసంఘ్ నాయకులు శ్రీఅటల్ బిహారీ వాజ్‌పాయ్ నేడు నామినేషన్ దాఖలు చేశారు.

ఈ రోజు మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు.

ఫక్రుద్దీన్ స్మృతికి కాస్ట్రో సంతాపం

హవానా, ఫిబ్రవరి 15

క్యూబా ప్రధానమంత్రి ఫైడల్ కాస్ట్రో నేడిక్కడ భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించి రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మృతికి సంతాపాన్ని తెలియ జేసే గ్రంథంలో సంతకం చేశారు

కాస్ట్రోమంత్రి వర్గ సహచరులు సీనియర్ పార్టీ అధికారులుకూడా సంతాప గ్రంథంలో సంతకాలు చేశారు.

మధ్యప్రదేశ్‌లో ప్రధాని పర్యటన

ఈ నెలాఖరులో

భోపాల్, ఫిబ్రవరి 15

ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ఈ నెలాఖరులో మధ్యప్రదేశ్‌లో ఎన్నికల పర్యటన జరుపుతారు

ప్రధాని పర్యటన తేదీలను ఇంకా నిర్ణయించ లేదని రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ ఎస్. సి. శుక్లా తెలిపారు. ప్రధాని రాష్ట్రంలో రెండు రోజుల పాటు పర్యటిస్తారని అన్నారు.

శ్రీ సంజయ్ గాంధీని ఆహ్వానించామని, ఆయన తరువాత పర్యటించవచ్చునని అన్నారు.

డిటెన్యూలందరి విడుదల

నిషేధించబడిన సంస్థలకు చెందినవారు మినహా మిగతా డిటెన్యూలందరినీ విడుదల చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

రాష్ట్రంలో 92 మందిచే నామినేషన్ల దాఖలు

కడపనుండి శ్రీ ఈశ్వరరెడ్డి, కరీంనగర్‌నుండి శ్రీ రాజేశ్వరరావులచే

హైదరాబాద్, ఫిబ్రవరి 15

రానున్న లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసేందుకు యిప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 92 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు నేడిక్కడకు అందిన అధికార సమాచారం తెలియచేస్తున్నది

నామినేషను దాఖలు చేసిన ప్రముఖులలో ప్రస్తుత లోక్‌సభ సభ్యులు, కడప జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై. ఈశ్వరరెడ్డి, ప్రదేశ్ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ సి హెచ్. రాజేశ్వరరావు లున్నారు. వీరు కడప, కరీంనగర్ నియోజక వర్గాల నుండి నామినేషన్‌లు వేశారు.

అలాగే మాజీ రాష్ట్ర మంత్రి శ్రీ విజయ భాస్కర రెడ్డి కర్నూలు నుండి కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగాను, శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి రాజంపేట నుండి జనతా పార్టీ అభ్యర్థిగాను నామినేషన్ వేశారు

శ్రీ మురళీ మోహన్ నామినేషన్

జనతాపార్టీ అభ్యర్థిగా శ్రీ గొట్టిపాటి మురళీమోహన్ విజయవాడ నియోజకవర్గం నుండి పోటీ చేయటానికి నేడు మచిలీపట్నంలో నామినేషన్ దాఖలు చేశారు.

సదాశివరావు నామినేషన్

గుంటూరు నియోజకవర్గంనుండి జనతా పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ కె. సదాశివరావు యీ రోజు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ వేసేందుకు జనతా పార్టీ కార్యాలయం నుండి వూరేగింపుగా వెళ్ళారు. ఈ ఊరేగింపులో శాసనసభ్యులు శ్రీ ఎన్. వెంకటరత్నం, శాసనమండలి సభ్యులు శ్రీ జూపూడి యజ్ఞనారాయణ, తాడికొండ పంచాయతీ సమితి మాజీ అధ్యక్షులు శ్రీ పొదిలి అప్పారావు, శ్రీ పెదారెడ్డి, వి. సామిరెడ్డి, శ్రీ బి. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన తర్వాత తిరిగి జనతా పార్టీ కార్యాలయంవద్ద జరిగిన సభలో శ్రీ సదాశివరావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్న శ్రీ పొదిలి అప్పారావు, శ్రీ రావెళ్ళప్రసాదరావు, శ్రీ కన్నంరాజు, శ్రీ యస్. వాసిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో నామినేషన్లు దాఖలు చేసిన వివిధ పార్టీల అభ్యర్థుల వివరాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

మచిలీపట్నం : వడ్డె శోభనాద్రీశ్వరరావు (జనతా), యం. శీతారామాంజనేయులు (కాం. డమ్మీ),

విజయవాడ : యం. శీతారామాంజనేయులు (కాం డమ్మీ), గొట్టిపాటి మురళీమోహన్, కొమరగిరి కృష్ణమోహన్‌రావు, (జనతా), మద్దినేని దశరథ రామారావు (ఇండి), కంఠమనేని శివాజీ (ఇం)

గుంటూరు : డాక్టర్ కె. సదాశివరావు (జనతా) నర్సరావుపేట : కోనేరు కాశయ్య (ఇం), హిందూపూరు : పి నారాయణ (ఇం), నాగర్‌కర్నూల్ : యం భీష్మదేవ్ (కాం), మహబూబ్‌నగర్ : యం. సుదర్శన్‌రెడ్డి (ఇం), సికింద్రాబాదు: యం. యం. హషీమ్ (కాం) వై. రాజేంద్రబాబు (ఇం), కె జోసెఫ్‌రెడ్డి (ఇం), కరీంనగర్ : సిహెచ్. రాజేశ్వరరావు (కమ్యూ), ఖమ్మం : డాక్టర్ వై. రాధాకృష్ణమూర్తి (మార్క్సిస్టు), చిర్రావూరు లక్ష్మీనరసయ్య (మా. డమ్మీ), మిర్యాలగూడ : బంటుస్వామి (ఇం), నర్సాపూర్ : ఉద్దంరాజు రామం (మా), అల్లూరి సత్యనారాయణ (మా. డమ్మీ), ఏలూరు : మాగంటి లక్ష్మీనారాయణ ప్రసాద్ (ఇం), కడప : పూటుకూరి రామిరెడ్డి (జనతా), కె. ఓబుల్‌రెడ్డి (కాం), వై. ఈశ్వరరెడ్డి (కమ్యూ), సిద్దిపేట: యస్ వేములు (ప్ర.కాం), మెదక్: రఘుసాయము (ఇం), రాజంపేట: పి. తిమ్మారెడ్డి (జనతా), పి.రంగారెడ్డి (జనతాడమ్మీ). నెల్లూరు: టి. రామానాయుడు (మా). కర్నూలు: కె. విజయ భాస్కరరెడ్డి (కాం), పార్వతీపురం: కిశోర్ చంద్ర సురేంద్రదేవ్ (కాం) బొబ్బిలి: యు. లక్ష్మీనరసింహరాజా (ఇం), అనకాపల్లి: అప్పలనాయుడు (కాం) రాజమండ్రి క్రొవ్విడి లింగరాజు (ప్ర కాం), సి. యస్ వీరారెడ్డి (ఇం), అమలాపురం: కొనేటి మోహనరావు (ఇం), ముస్తాలసుజాత (ఇం), హైదరాబాద్: మీర్ అహ్మద్ అలీ ఖాన్ (జనతా) సయ్యద్ అహ్మద్ ముస్తఫా హుస్సేన్ (ఇం).

సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగానే వెంకటేశ్వరపాలెం రైలుప్రమాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15

గత సంవత్సరం నవంబర్ 17 న కావలికి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర పాలెంవద్ద జరిగిన రైలు ప్రమాదానికి రైల్వే సిబ్బంది వైఫల్యమే కారణమని విచారణలో తేలింది.

నవంబర్ 17న ఒక గూడ్సురైలు మరో గూడ్సు రైలును ఢీకొనగా, అది పోయి విజయవాడ-మద్రాసు ప్యాసెంజరు రైలును ఢీకొన్న విషయం పాఠకులకు విదితమే.

ఈ ప్రమాదంలో తొమ్మిది మంది చనిపోగా 8 మందికి తీవ్రమైనగాయాలు, 17 మందికి స్వల్పమైనగాయాలు తగిలాయి.

రైల్వే భద్రతా విభాగం అడిషనల్ కమీషనర్ శ్రీ కె యస్. కామత్ విచారణ జరిపి, ప్రమాద కారణాలను రైల్వేబోర్డుకు నివేదించారు.

చక్కెర కుంభకోణంలో డి.యం.కె మంత్రుల పాత్ర

సర్కారియా కమిషన్ ముందు వాదనలు

మద్రాసు, ఫిబ్రవరి 16

చక్కెర కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి శ్రీ యం. కరుణానిధి, ఆహార మంత్రి శ్రీ పి. యు. షణ్ముగంలకు వ్యతిరేకంగా యిచ్చిన సాక్ష్యాలను ఖండించడానికివీలులేదని, చక్కెరమిల్లుయజమానులలో ఏర్పడిన నిరాశనిస్పృహల వాతావరణాన్ని ఈ మంత్రులు తమ జేబులను నింపుకునేందుకు ఉపయోగించుకున్నారని అడిషనల్ సొలిసిటర్ జనరల్ శ్రీ వి. పి. రామన్ నేడు సర్కారియా కమిషన్ ముందు చెప్పారు.

చక్కెర కుంభకోణం కేసులో మంత్రులు తమ జేబులు నింపుకోవడం మాత్రమే గాకుండా వారివల్ల ప్రభుత్వానికి ఎంతో నష్టం వచ్చిందని, వినియోగదారుని పై అదనపు భారం పడిందని ఆర్గ్యుమెంట్ల సమయంలో ఆయన చెప్పారు.

ఈ కేసులో శ్రీ కరుణానిధి, షణ్ముగంలు అధికార బాధ్యతల నిర్వహణలో లంచం తీసుకోవడం మాత్రమే గాకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు.

శ్రీ కరుణానిధి ఆయన మంత్రివర్గ సహచరులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతున్న సర్కారియా కమిషన్ చక్కెర కుంభకోణం కేసు విచారణను నేడు ముగించింది.

అఫిడవిట్‌లలో చెప్పిన విషయాలనుండి ఏ సాక్షికూడా వెనక్కు మళ్ళలేదని దర్యాప్తు సందర్భంగా వారిచ్చిన స్టేట్‌మెంట్లు స్వచ్ఛందంగా యిచ్చినవేనని శ్రీ రామన్ అన్నారు.

తమిళనాడులోని 9 మంది ప్రయివేట్ చక్కెర ఉత్పత్తిదారులనుండి శ్రీ కరుణానిధి రు. 13 లక్షల 21 వేలు లంచం తీసుకున్నారని శ్రీ రామన్ చెప్పారు

1968 లో తమిళనాడులో 1,13 వేల టన్నుల చక్కెర మిల్లులలో నిల్వవుండిపోయిందని ప్రభుత్వం నియమించిన ఏజన్సీలు వాటిని తీసుకొనకపోవడంతో ఏర్పడిన సంక్షోభ పరిస్థితిని రాష్ట్ర మంత్రులు వినియోగించుకొన్నారని ఆయన చెప్పారు.

ఈ పరిస్థితులలో దక్షిణ భారత చక్కెర మిల్లుల సంఘం తన అధ్యక్షుడు శ్రీ పి. మారుతై పిళ్ళై ద్వారా వారి యిబ్బందులను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసిందని మిల్లులను టోకు వ్యాపారులుగా నియమించేందుకు క్వింటాలుకు రు. 3 లంచాన్నివ్వాలని శ్రీ కరుణానిధి, షణ్ముగం కోరారని ఆయన చెప్పారు.

కమిషన్ విచారించిన 127 మంది సాక్షులలో 20 మంది చక్కెర మిల్లుల అధిపతులు 97 మంది చక్కెర డీలర్లు వున్నారని ఆయన చెప్పారు.

మిల్లులకు అనుకూలంగా నిర్ణయం చేసేంతవరకూ ఆహారమంత్రిత్వ శాఖకు ఏమీ తెలియదని, తర్వాత నోరు మెదపకుండ దానిని అమలు జరపాల్సి వచ్చిందని శ్రీ రామన్ అన్నారు.

చక్కెర మిల్లుల యజమానులు తమ దరఖాస్తులను నేరుగా ఆహారశాఖ మంత్రికి సమర్పించారని, ఆయన వెంటనే ఉత్తర్వులు జారీచేశారని యిది అధికార పద్ధతులను తీవ్రంగా వుల్లంఘించడమేనని ఆయన అన్నారు. నిర్ణయాలు ఉత్తర్వులు వాటికి సంబంధించిన శాఖలద్వారా జరగలేదన్నారు.

మిల్లులకు అనుకూలంగామంత్రి నిర్ణయం తీసుకున్న తర్వాత మంత్రి నుండి వచ్చిన వ్రాత పూర్వక ఆదేశాల మేరకు మాత్రమే పౌర సరఫరాల కమీషనర్ ఉత్తర్వులు జారీచేశారని శ్రీ రామన్ అన్నారు.

మిల్లులు తమకు యివ్వజూపిన లంచం అందేంత వరకు ఉత్తర్వుల విడుదలలో జాప్యం జరిగిందని ఆయన చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ చక్కెర విధానాన్ని 1970 లో డి. ఎం కె ప్రభుత్వం ఏకపక్షంగా మార్పుచేయడం ప్రభుత్వ విధానాలను ఉల్లంఘించడమేనని తమిళనాడు ప్రభుత్వ న్యాయవాది శ్రీ ఎన్. టి వానమామలై నేడు సర్కారియా కమిషన్ ముందు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యమంత్రులతో సంప్రదించి చక్కెర ఉత్పత్తిలో 70 శాతం లెవీ చక్కెరగా ప్రభుత్వం తీసుకోవాలని కేంద్రం నిర్ణయించిందని, ఈ నిర్ణయాన్ని ఏ రాష్ట్రం కూడా ఏకపక్షంగా మార్చడానికి వీలులేదన్నారు.

ప్రభుత్వోద్యోగుల సౌకర్యాలపై ఆంక్షల తొలగింపు

లక్నో, ఫిబ్రవరి 15

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తన ఉద్యోగులకు కుటుంబ నియంత్రణకు సంబంధించి గతంలో అమలు పరచిన నిబంధనలను సడలించింది ఉద్యోగులకు అనేక సౌకర్యాలను పునరుద్ధరించింది.

కుటుంబ నియంత్రణ కార్యక్రమం అమలులో మంచి పురోగతి సాధించబడినందున, ప్రజలు ఐచ్ఛికంగా ఇచ్చిన సహకారాన్ని దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయం తీసుకోబడినట్లు అధికారయుతంగా తెలియ చేయబడింది

ఉద్యోగులకు ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచిత వైద్య సౌకర్యాలకు సంబంధించి ఆంక్షలు తొలగించబడ్డాయి.



న్యూఢిల్లీలో పాత జుమా మసీదులో ఖననం చేయడానికై శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ భౌతిక కాయాన్ని తీసుకెళుతున్న త్రివిధ సైనిక దళాధిపతులు.

న్యూఢిల్లీలోని తుర్క్‌మన్‌గేటుప్రాంతంలో పేదల కొంపలు కూల్చినది ఎవరికోసం?

న్యూఢిల్లీలోని తుర్క్‌మన్ గేట్ ప్రాంతంలోని పేదల యిళ్లు అనేకం 1976 ఏప్రిల్లో బుల్‌డోజర్లతో నేల మట్టం చెయ్యబడ్డాయి. నిరంతరాయంగా సాగిన ఆ విధ్వంస కాండకు ఎదురైన ప్రతిఘటన క్రమంలో 29 మంది మట్టు పెట్టబడ్డారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. అరెస్టు చెయ్యబడ్డారు. నివాస గృహాలను నిరంతరంగా నేల మట్టం చేసిన యీ కార్యక్రమంలో వారు చేపట్టిన పాపానికి, ప్రజల రక్తం చిందించబడింది.

అటువంటి తుర్క్‌మన్ గేటు ప్రాంతంలో బాటిబాయాలంత అక్షరాలతో ఈనాడొక సైన్ బోర్డు కనిపిస్తుంది. "వాణిజ్య భవన సముదాయానికి కేటాయింపబడిన స్థలం" అని.

తుర్క్‌మన్ గేటు ప్రాంతంలో నివసిస్తున్న పేదలను నిర్వాసితులనుచేసి, కడగండ్ల పాలుచేసిన యీ దుర్ఘటన, ప్రభుత్వంలోగాని, ఢిల్లీ పాలక యంత్రాంగంలో గాని ఎటువంటి హోదా కూడా లేని ఒక వ్యక్తి ఎమర్జెన్సీని ఎంత ఘోరంగా దుర్వినియోగం చేశాడన్నదానికి మచ్చుతునక.

1976 ఏప్రిల్ 15 వ తేదీన డి. డి. ఎ బుల్‌డోజర్లు ఆ ప్రాంతంలో నివసిస్తున్న పేదల యిండ్లను నేల మట్టం చేసేందుకు గుంయ్ మంటూ దొర్లుకు వచ్చాయి.

ఆ యిళ్ళలోనివసిస్తున్న వాళ్ళకు కనీసం ముందుగా వర్తమానమైనా చెయ్యలేదు అక్కడ కాపురాలుంటున్న వాళ్ళకి నోటి మాట ద్వారా తమ అభ్యంతరం తెలపడం తప్ప గత్యంతరం లేకపోయింది ఇళ్ళను నేలమట్టం చేసే కార్యక్రమం రెండు రోజుల పాటు ఏ గొడవా లేకుండా శాంతంగానే సాగిపోయింది. 18 వ తేదీన ఆ ప్రాంతానికి చెందిన గృహిణులుకొందరుయిత సత్యాగ్రహం ప్రారంభించారు. అలా యిళ్లనుండినిర్వాసితులైన జనాన్ని ఎటువంటి కనీస సౌకర్యాలూ లేకుండా అయినయట గుంపుగా వదిలేస్తున్నారన్న సమాచారం (యిది నిజమే) అందడమే యీ సత్యాగ్రహానికి ప్రేరణగా పనిచేసింది. దీనితో, అక్కడి జనంలో ప్రతిఘటనాభావం పుంజుకుంది.

ఈలోగా జుమా మసీదు ప్రాంతంలో పోలీసులు పురుషులను మందిగా పోగేసి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు బలప్రయోగం ప్రారంభించారు దానితో అక్కడ కూడా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. కమ్యూనిస్టుపార్టీ అంతకుముందే యిటువంటి బలవంతపు కుటుంబ నియంత్రణను, పోలీసుల అత్యాచారాలను నిరసిస్తూ ప్రధాన మంత్రికి ఒక మెమొరాండం సమర్పించింది. అయినా కూడా, అటువంటి బలప్రయోగాన్ని ఆపు చెయ్యడానికి ఎటువంటి చర్యా తీసుకోబడలేదు.

ఈ నిర్బంధ ఆపరేషన్లకు తోడు కొంపలు కూల్చే కార్యక్రమం తోడయ్యే సరికి, ప్రజల్లో పెరిగిన నిరసనను, భయాలను మతవాద, అభివృద్ధి నిరోధకశక్తులు కొంత వరకు వినియోగించుకున్నాయి.

ఉద్రిక్తత పెరిగిపోతోంది; ఆలోచనా రహితంగా సాగుతున్న కొంపలు కూల్చే కార్యక్రమానికి ప్రతిఘటనా భావం ప్రబలుతోంది. అది పెరిగిపెరిగి అక్కడనివసిస్తున్న జనం భౌతిక ప్రతిఘటనకు పూనుకోవడంతో పోలీసులు తట్టుకోలేక, ఏప్రిలు 19 ఉదయం పూట విచక్షణా రహితంగా తుపాకి కాల్పులకు పూనుకొన్నారు.

ఫలిత మేమిటయ్యా అంటే పెద్ద గలభా, హాహాకారాలు. సుమారు 25 మంది నేల కొరిగారు. సుమారు 2 వందల మంది గాయపడ్డారు. వారిలో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరు,వికటాట్టహాసాలతో విశృంఖలానందంతో కాల్పులు సాగిస్తున్న పోలీసుల దృష్టినుండి తమనుతాము కాపాడుకోవాలన్న దృష్టితో గుట్టల క్రింద దాక్కున్నారు. అటువంటివాళ్లు ఆ గుట్టల క్రిందనే కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.

ఒకడు బుల్‌డోజరు క్రింద నలిగిపోయాడు స్త్రీలు, బాలబాలికలతో సహా డజన్లకొలది వ్యక్తులజాడ తెలియరావడం లేదు. అంతటితో తృప్తి చెందక, పోలీసులు విచక్షణా రహితంగా కనిపించిన వాళ్ళనల్లా నిర్దాక్షిణ్యంగా బాదమోది, అరెస్టు చెయ్య పూనుకొన్నారు, అలా అరెస్టు చెయ్యబడిన వారి సంఖ్య ఒక వెయ్యికి మించింది.

విచక్షణా రహితంగా పోలీసులు సాగించిన అరెస్టుల కొక నమూనా ఉదాహరణ ఒక కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్నంతటిని మూకుమ్మడిగా అరెస్టు చెయ్యడం. అతనికిగల ఓ చిన్న కర్మాగారం నేలమట్టం చెయ్యబడింది. అతని జాడా జాబూ తెలియలేదు. 32 ఏళ్ళ, 28 ఏళ్ళ వయసుగల అతని సోదరులు, 9 ఏళ్ళ కొడుకు, అతని సోదరుని 8, 12 ఏళ్ళ కొడుకులు, 30, 25, 22, 20 ఏళ్ళ వయసు గల మేనల్లుళ్లు, 27 ఏళ్ళ మేనల్లుని భార్య, మరో కుటుంబ సభ్యుడు (23 ఏళ్ల) వీళ్ళందరినీ పోలీసులు అరెస్టు చేశారు.

ఆ ప్రాంతంలో గిరిధర్‌లాల్ పన్నాలాల్ అనే ఓ ఫాక్టరీ వుండేది. రాజధానిలోని మిక్కిలి పాత ఫాక్టరీల్లో అదొకటి, ఆ ఫాక్టరీలో పనిచేసే 60 మంది కార్మికులూ యథాప్రకారంగా 19 వ తేదీ ఉదయం పనిలోకి వచ్చారు అక్కడ గలభా ప్రారంభం కాగానే తన ప్రాణాలను దక్కించుకోవడానికిగాను ఫాక్టరీ యజమాని రంగంనుంచి చల్లగా జారుకున్నాడు ఫ్యాక్టరీ నుంచి కార్మికులను ఖాళీ చేయించాల్సిందిగా కోరుతూ ఫ్యాక్టరీ యజమానే పోలీసులను ఫోను చేశాడు.

గుంపులనుంచి ఫాక్టరీ ఆస్తులను కాపాడటం కోసం కార్మికులు ఫాక్టరీ తలుపులు లోపలనుంచి బిగాయించుకుని కూర్చున్నారు. సాయుధ పోలీసుదళాలు ఫ్యాక్టరీ గేటుదగ్గర ప్రత్యక్షమై గేట్లు బద్దలుకొట్టి లోపల ప్రవేశించారు. కార్మికులు చెప్పేదేమిటో విని పించుకోనైనా వినిపించు కోకుండా వాళ్ళ మీదపడి తగిలేదీ తప్పేదీ చూడకుండా లాఠీలతో, బాయొనెట్లతో రైఫిల్ మడమలతో మోది బరబర లాక్కెళ్ళి పోలీసు వ్యాన్లలో పడేసి జైళ్ళకు తోలుకుపోయారు.

అధికారులు ఆ ప్రాంత మంతటిలో కర్ఫ్యూ ప్రకటించి మరీ దమను చెయ్యడమన్నది మరింత ఆశ్చర్యకర విషయం!

డిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ [డి.డి.ఎ] యిప్పుడీ 28 యకరాల స్థలంలో పలు అంతస్తుల ఆకాశ హర్మ్యాలు నిర్మించబోతోంది ఎందుకో తెలుసాండి: ముందు ఉద్దేశింపబడినట్లు పేదల నివాసార్థంకాదు, వర్తక వాణిజ్య కేంద్రంగా దీన్ని నిర్మిస్తున్నారు. పలు అంతస్తుల యీ భవనం నివాస వైశాల్యం 28 యకరాలుంటుంది. అంటే, 12 లక్షల చదరపు అడుగుల వైశాల్య ముంటుంది. అందులో కృషి భవన్, ఉద్యోగభవన్, రైలు భవన్,వాయు భవన్ వీటన్నింటిలోనూ వున్న వివిధ యంత్రాంగ కార్యాలయాన్ని పెట్టడానికి సరిపడేటంత జాగా అన్నమాట.

ఢిల్లీ మాష్టర్ ప్లాను ప్రకారం, ఈ ప్రాంతంలో అంతస్తుల నివాస భవనాలు కట్టి జనాభా రద్దీ మిక్కుటంగావున్న ఈ ప్రాంతంలో రద్దీని తగ్గించాల్సివుంది ఇప్పుడీ కొత్త మార్పు మూలంగా ఈ ప్రాంత ప్రజలకు గాలీ, వెలుతురూ కరువయ్యే పరిస్థితి ఏర్పడుతుంది ఉత్పాదనంత యిరుకు, మురికి వగైరా వగైరాలు దాపురిస్తాయి. ఇలా కొంపలు కూల్చడంద్వారా, పునరావాస కల్పనద్వారా ఢిల్లీ అభివృద్ధి సంస్థ అధికారులు ప్రజలకు వేదన రోదనలను మాత్రమే కల్పిస్తున్నారు. డి డి ఎ. వారి ఈ తుగ్లక్ పథకానికి వ్యతిరేకంగా ఢిల్లీ నగర కమ్యూనిస్టు సమితి తన తీవ్ర అసమ్మతిని తెలిపింది

అసలు సమస్య ఏమిటంటే, ఇంతకీ ఈ పేదప్రజలకు కొంపాగోడూ లేకుండా చేసినది ఎవరి ప్రయోజనంకోసం? సమాధానం స్పష్టం: వర్తక ప్రభువులకోసం, వాణిజ్య కుబేరుల కోసం.

ఆర్థిక కార్యక్రమం అమలుకు బుల్‌డోజర్లెందుకు?

ఆర్థిక కార్యక్రమం అమలు విషయమై మాట్లాడుతూ 1976 మే 4 వ తేదీన రాజ్యసభలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు భూపేష్ గుప్తా ప్రసంగిస్తూ "20 అంశాల కార్యక్రమం అమలుకు బుల్‌డోజర్లెందుకు స్వామీ" అని ప్రశ్నించారు

అయితేనేం, డి డి. ఎ. కి చెందిన అధికార రోగపూరిత బధిరాంధులైన మట్టిబుర్రలకి యిదేమీ తలకెక్కలేదు. ఢిల్లీలోని మురికి వాడల్లో లక్షలాది ప్రజలు నివసిస్తున్నారు. వాళ్ళ జీవితాలను మెరుగుపరచడానికి డి. డి. ఏ. అధికారులకు ఒక్కటే మార్గం కనిపించింది. తల దాచుకుంటున్న కొంపల్ని బుల్‌డోజర్లుపయోగించి నేల మట్టం చెయ్యడం?

ఎమర్జెన్సీ కవచమొంది కోతికి కొబ్బరికాయ దొరికినట్టు వాళ్ళకి కొత్తగా ఓ యువ నాయకమ్మన్యుడు దొరికాడాయిరి అతని మద్దతుతో వాస్తు ప్రజల కష్టాలను కడగండ్లనూ పట్టించుకోకుండా, లక్షలాది మందిని అమానుషంగా ఢిల్లీనుండి తరిమేశారు. ఇలా సాగింపి ఢిల్లీనగరాన్ని అందంగా తయారుచేసే పేర సాగింపబడిన ఈ సుందరముదనష్టపు కార్యక్రమం అంతా.

మతీ సుతీ లేని మానవత్వ వ్యతిరేకమైన యీ కార్యక్రమంపట్ల అది నుండీ కూడా కమ్యూనిస్టుపార్టీ తన నిరసనను వ్యక్తం చేస్తూ వచ్చింది నగర పాలక సంఘంలోను పార్లమెంటులోనూ కమ్యూనిస్టుసభ్యులు పదే పదే యీ సమస్య గురించి ప్రస్తావించి, తమ అభ్యంతరాన్ని ప్రకటించారు. అయితేనేం చెవిటివానిముందు శంఖం వూదినట్లే అయింది.

కొంపలు కూల్చే యీ కార్యక్రమమంతా 1975 శీతకాలంలో ప్రారంభమైంది. నోటీసూగీటీసూ ఏమీ లేకుండా మురికివాడల్లోని కొంపలు కూల్చే కార్యక్రమం ప్రారంభమైంది. వాటిలో నివసించే వాళ్ళని తోలుకుపోయి ఖాళీస్థలంలో వదిలారు. ఒక్కొక్క కుటుంబం 25 చదరపు గజాల స్థలంలో కొత్తగా కొంపలు కట్టుకోవాలి, పోనీ ఆర్థిక సహాయ మేమైనా చేశారా అంటే అలాంటిదేమీలేదు.

కమ్యూనిస్టుపార్టీ నిరసన

కమ్యూనిస్టు పార్లమెంటుసభ్యుల బృంద మొకటి కూల్చివెయ్యబడిన కొంపలను, కొత్తగా కేటాయింపబడిన స్థలాలను చూసింది. భూపేష్ గుప్తా నాయకత్వాన వెళ్ళిన ఆ బృందంలో ఇంద్రజిత్ గుప్తా, సి కె. చంద్రప్పన్, ఎస్. బి పర్దేశాయ్, సనత్‌రాహా, భోలాప్రసాద్, కాలముత్తు, ఢిల్లీ రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి ప్రేమ్‌సాగర్‌గుప్తా, ట్రేడ్ యూనియన్ నాయకుడు బి. డి. జోషీలు ఆ బృందంలో వున్నారు.

పరిశీలనానంతరం ఆ బృందం గృహ నిర్మాణశాఖ మంత్రికి, మొత్తం ఆ గృహ నిర్మూలన కార్యక్రమం జరిగిన తీరుపైన తన తీవ్ర నిరసనను తెలిపింది. ఆ లా కొంపాగోడూ పోగొట్టుకున్న ప్రజలు ఎదుర్కొంటున్న నవాలక్ష సమస్యలను గురించి కూడా ఆ మంత్రి గారికి ఎరుక పరచారు.

పార్లమెంటులోని కమ్యూనిస్టు సభ్యులు కూడా యీ విషయంపై పార్లమెంటులో అనేకమార్లు ప్రస్తావించారు.

1976 మే 28న, ఢిల్లీ బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) విషయం గృహవసతి, ఉద్యోగ కల్పన విషయాలపై చర్చలు జరిపేందుకుగాను కమ్యూనిస్టు పార్టీ ఢిల్లీనగర సమితిచేత ఒక సదస్సు ఏర్పాటు చెయ్యబడింది. మొత్తం ఆ పథకమంతటినీ ఆ సదస్సు కూలంకషంగా పరిశీలించి, ప్రధాన మంత్రికీ, తదితరులకీ, ఒక మెమొరాండం సమర్పించింది మురికి వాడలను మెరుగు పరచడానికీ, పేదల జీవనపరిస్థితులనుమెరుగు పరచడానికీ పార్టీయొక్క ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పార్టీ తన ఆ మెమొరాండంలో సూచించింది

'కొంపలుకూల్చేకార్యక్రమం'

అయితేనేం, ప్రభుత్వం సహేతుకమైన యీ ప్రతిపాదనలను పక్కన నెట్టేసి, 'కొంపలుకూల్చే కార్యక్రమాన్ని' అమలు జరిపింది. ఆ క్రమంలో ప్రభుత్వం 7 లక్షల మంది పేదలను కొంపల్లోంచి లేవగొట్టి ఎక్కడో దూరాన 28 సెటిల్‌మెంట్లకు వాళ్లని చేర్చింది వారి వృత్తి ఉద్యోగాలకుగాని పౌర సౌకర్యాలకుగాని, యిళ్లు కట్టుకొనేందుకు రుణాల విషయంలో గాని, ప్రత్యామ్నాయ ఏర్పాటేమీ ప్రభుత్వం చెయ్యకుండా యీ కూల్చివేత కార్యక్రమానికి పూనుకొంది.

చౌరీ బజారునుకూల్చే పథకం

ఈ మురికివాడల కూల్చివేత కార్యక్రమం సగం పూర్తయ్యాక ఢిల్లీ మునిసిపల్ కమీషనర్‌గారి బుర్రలో అకస్మాత్తుగా మరో ఆలోచన తళుక్కుమంది ఒకప్పుడు షాజహానాబాదు అని పిలవబడుతూ వుండిన శిల్ప సమన్వితమైన చౌరీ బజారు ప్రాంతంలోని ఇళ్లనీ, కొట్లనీ కూల్చేస్తేపోతుందన్నదే ఆ ఆలోచన.

చౌరీ బజారు అన్నది 16 యకరాల విస్తృత ప్రాంతం. ఆ ప్రాంతంలో 2,140 కుటుంబాలు నివసిస్తున్నాయి 1,126 షాపులున్నాయి. 134 చిన్నఫ్యాక్టరీలున్నాయి 248 గోడౌనులున్నాయి అటువంటి చౌరీ బజారుకి యిరుపైపులావున్న గట్టి ఇళ్ళను కూల్చేయాలన్నదే ఆ ఆలోచన.

వీటన్నింటినీ నేల మట్టంచేసి, పలు రాకాల అకాశ హర్మ్యాలు నిర్మించాలన్నది నగర పాలకుల పథకం. నిర్వాసితులను ఏం చెయ్యాలీ వాళ్ళకి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు ఏం చెయ్యాలన్న అంశంపై అధికారులకి ఎటువంటి అవగాహనా లేదు. ఇల్లా నిర్వాసితుల్ని చేస్తే తలెత్తే సమస్యలకి వాళ్ళకి పరిష్కార మేమీ లేదు.

కమ్యూనిస్టుపార్టీచే ప్రజా సమీకరణ

ఈ వార్త బయటికి పొక్కగానే కమ్యూనిస్టుపార్టీ చొరవ తీసుకొని, ఈ పథకానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సమీకరణ ప్రారంభించింది. ఈ పిచ్చి తుగ్లక్ పథకాన్ని నిరసిస్తూ ప్రభుత్వానికి పార్టీ పలు లేఖలు రాసింది. పార్లమెంటులో అనేక పర్యాయాలు, యీ సమస్యపై కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ప్రసంగించారు. ఈ పథకాన్ని విరమించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జూలై 15న, ఢిల్లీ కమ్యూనిస్టు నాయకులతో కలసి, కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటు సభ్యులు భూపేష్‌గుప్తా, జడ్. ఎ. అహ్మద్‌లు ఆ ప్రాంతంలో పర్యటించారు. పర్యటనానంతరం గృహ నిర్మాణశాఖ మంత్రికి రాసిన లేఖలో, ఆ పథకం అమలు జరగకుండా చూడాల్సిన అవశ్యకతను గురించి భూపేష్ గుప్తా గట్టిగా నొక్కి చెప్పారు.

ఈలోగా, కమ్యూనిస్టుపార్టీ, ఢిల్లీ రాష్ట్ర సమితి, పలు సభలనూ, సదస్సులనూ నిర్వహించి, ఆ ప్రాంతాల ప్రజలను సమీకరించింది.

ఈ సందర్భంగా కమ్యూనిస్టుపార్టీ అంతటితోనే సరిపెట్టుకోకుండా 'న్యూఏజ్'లోనూ, తదితర పార్టీ పత్రికల్లోనూ ఈ కొంపల కూల్చివేత కార్యక్రమాన్ని గురించి బట్టబయలు చేస్తూ అనేక వ్యాసాలు ప్రచురించింది. నిజానికి, ఈ గృహ నిర్మూలన దుష్ట పథకాన్ని బయటపెట్టి, పెన్నారు వాటి దుష్ఫలితాలను సైతం లెక్కచెయ్యకుండా మూర్ఖారపట్టిన తొలిపత్రిక న్యూ ఏజ్.

అలా బయట పెట్టిన బహుకొద్ది పత్రికల్లో అగ్రగామి పత్రిక కూడా అదే నంటే అతిశయోక్తి కాదు.

రాష్ట్రపతి శ్రీ అహ్మద్ అంత్యక్రియలకు వచ్చిన సోవియట్ అధ్యక్షవర్గ ఉపాధ్యక్షులు ఎస్. ఎం. మాద్చానోవ్ నాయకత్వాన హాజరైన సోవియట్ ప్రతినిధివర్గం ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని కలుసుకున్న దృశ్యం.

వివిధ రాష్ట్రాల్లో నామినేషన్లు

చండీగఢ్, ఫిబ్రవరి 16

పంజాబ్‌లో రావోర్ పార్లమెంటరి నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర వాణిజ్యశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ బూటా సింగ్ మొన్న నామినేషన్ దాఖలుచేశారు.

గుజరాత్‌లో

గుజరాత్‌లో మొన్న ఒక్క రోజులోనే వివిధ పక్షాలకు చెందిన వారు 28 మంది నామినేషన్లు దాఖలు చెయ్యడంతో ఇంత వరకు నామినేషన్లు దాఖలు చేసిన వారి సంఖ్య 48 కి చేరుకుంది.

నామినేషన్లు దాఖలు చేసిన వారిపేర్లు: జనతాపార్టీ అధ్యక్షులు శ్రీ మొరార్జీదేశాయ్ (సూరత్) కాంగ్రెస్ అభ్యర్థిగా వాణిజ్య శాఖ మాజీ మంత్రి శ్రీ సునూభాయ్ షా (సురేంద్రనగర్), రాష్ట్ర మాజీ మంత్రి ఛబిల్‌దాస్ మెహతా (భావనగర్) సిండికేట్ ఎ ఐ సి సి. కార్యదర్శి శ్రీ మనుభాయ్ పటేల్ (బరోడా),కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ డి బి. జాదేజా (జామ్‌నగర్) శ్రీ మొరార్జీదేశాయ్ నామినేషన్ దాఖలు చేసిన వెంటనే ఆయన ప్రత్యర్థి శ్రీ జస్వంత్‌చౌహాన్ (కాం)కూడా నామినేషన్ వేశారు,

కమ్యూనిస్టు లీగ్ అభ్యర్థిగా శ్రీ ఠాకూర్ భీమ్ చంపాలాల్‌షా బరోడా నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేశారు. జనతా పార్టీ అభ్యర్థిగా బరోడాజిల్లాలోని బోలాపూర్‌పూర్ నియోజకవర్గం నుండి శ్రీ మనహర్‌భాయ్ పీర్‌సింగ్ భాయ్ రత్వ నామినేషన్ దాఖలు చేశారు. జనతాపార్టీ డమ్మీ అభ్యర్థిగా శ్రీ డి. జె. రత్న నామినేషన్ దాఖలు చేశారు.

జనతాపార్టీ అభ్యర్థిగా జునాగఢ్‌నుండి శ్రీ నరేంద్ర పి. నత్వాని (మాజీ న్యాయమూర్తి) నామినేషన్ దాఖలు చేశారు.

ప్రత్యర్థి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ అవాని యింకా నామినేషన్ దాఖలు చేయవలసి వుంది.

హిమాచల్ ప్రదేశ్‌లో

హిమాచల్‌ప్రదేశ్‌లో మొన్ననామినేషన్ చేసిన ఇద్దరు అభ్యర్థులతో మొత్తం సంఖ్య మూడుకు పెరిగింది.

మొత్తం రాష్ట్రంలో నాలుగు నియోజక వర్గాలున్నాయి

హమీర్‌పూర్ నుండి శ్రీ యస్. పి. ప్రాసర్ కాం), సిమ్లా నుండి శ్రీ బాలిమ్ సింగ్ [కాం] మండి నియోజకవర్గంనుండి శ్రీ నావల్ కిశోర్‌ఠాకూర్ [ఇండిపెండెంట్] నామినేషన్లు వేశారు.

తమిళనాడు

తమిళనాడులో మొన్న నామినేషన్‌దాఖలు చేసినవారిలో ప్రజాశాసనసభ మాజీసభ్యులు శ్రీ ఆర్. వెంకట్రామన్ కూడా వున్నారు.

శ్రీ వెంకట్రామన్ (కాం, ఈశాన్య మద్రాసు), మార్క్సిస్టుపార్టీ అభ్యర్థిగా శ్రీ పి. రామమూర్తి (మదురై) మార్క్సిస్టు పార్టీ తమిళనాడు యూనిట్ కార్యదర్శి శ్రీ ఎ. బాలసుబ్రహ్మణ్యం (దిండిగల్) నామినేషన్లు దాఖలుచేశారు.

భారత కమ్యూనిస్టుపార్టీ తమిళనాడు సమితి కార్యదర్శి శ్రీ ఎం. కళ్యాణసుందరం గతంలో ఎన్నికైన తిరుచిరాపల్లి నియోజకవర్గంనుండి తిరిగి నామినేషన్ దాఖలు చేశారు. 1971 లో ఉపఎన్నికల్లో కోయంబత్తూరు నియోజకవర్గంనుండ ఎన్నికైన భారత కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి శ్రీమతి పార్వతీకృష్ణన్ తిరిగి అదే నియోజకవర్గంనుండి నామినేషన్ వేశారు.

డి ఎం కె. అభ్యర్థి శ్రీ కె. రాజారాం (సేలం) నుండి నామినేషన్ వేశారు.

మహారాష్ట్రలో

మహారాష్ట్రలో నేడు నామినేషన్లు దాఖలు చేసినప్రముఖులలో సుబ్రహ్మణ్యన్‌స్వామి (జనతా), శ్రీమతి మృణాల్ గోరే (జనతా) శ్రీమతి అహల్యా రంగనేకర్ (మా) లు వున్నారు.

మహారాష్ట్రలో అహ్మద్ నగర్ నుండి కేంద్ర ఆహార, వ్యవసాయ స్టేట్ మంత్రి శ్రీ ఎ పి. షిండే బారామతి నుండి రక్షణ ఉత్పత్తుల శాఖ స్టేట్ మంత్రి శ్రీ వి. యస్. గాడ్గిల్ నిన్న తమ నామినేషన్లు దాఖలు చేశారు.

ఇప్పటివరకు వివిధ పార్టీలు దాఖలు చేసిన అభ్యర్థుల నామినేషన్ల వివరాలు యీ క్రింది విధంగా వున్నాయి

కాంగ్రెసు.37, బి యల్. డి. 12, మార్క్సిస్టు పార్టీ 2, రిపబ్లికన్ పార్టీ. పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ ఒక్కొక్కటి చొప్పున, ఇండిపెండెంట్లు.21.

హర్యానా

హర్యానా లోక్‌సభ సీట్లకు యింతవరకు నామినేషన్లు వేసినవారిలో ప్రజాస్వామ్య కాంగ్రెసు జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ రషీద్ అహ్మద్ వున్నారు. అహ్మద్ ఫరీదాబాద్ నుండి నామినేషన్ వేశారు. రద్దయిన లోక్‌సభ సభ్యులు శ్రీ టి హన్స్పేన్ (కాంగ్రెసు)కూడా నామినేషన్ దాఖలు చేశారు.

కురుక్షేత్ర నుండి కాంగ్రెసు అభ్యర్థిగా రాజ్యసభ సభ్యులు శ్రీ డి. డి. పూరి నామినేషన్ దాఖలు చేశారు.

అదే నియోజక వర్గం నుండి శ్రీ కె. కె. తుఫాన్ శ్రీ మ్హాత్ బహదూర్‌లు కూడా నామినేషన్లు వేశారు.

సోనేపట్ నుండి శ్రీ నిహార్‌సింగ్ శ్రీ అమర్‌నాథ్ (ఇండి, ఫార్వర్డుబ్లాకు) శ్రీ నారాయణ్ సింగ్ (ఇండి) నామినేషన్లు వేశారు.

ఏరాసెజియన్ నామినేషన్

మద్రాసు, ఫిబ్రవరి 16

రద్దయిన లోకసభలో డి. ఎం. కె. పక్షనాయకులు శ్రీ ఎరాసెజియన్ వెంగల్‌పట్ నియోజకవర్గంనుండి పోటీ చేయటానికి మొన్న నామినేషన్ దాఖలు చేశారు.

కాంచీపురం మునిసిపల్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు శ్రీ కె టి. ఎస్. మణి డమ్మీగా నామినేషన్ వేశారు.

శ్రీ పెరుంబు దూర్‌నుండి పోటీ చేయటానికి ఇండిపెంట్ అభ్యర్థి శ్రీ అంగముత్తు నామినేషన్ దాఖలు చేశారు

నెల్లూరు, వందవాసి, ఆర్కోణం నియోజక వర్గాలకు ఆరుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు,

మేఘాలయ

మేఘాలయ సమాచారమంత్రి శ్రీ పి. జి. మార్‌బనియాంగ్ [కాం] షిల్లాంగ్ నుండి నేడు నామినేషన్ దాఖలుచేశారు.

అదేస్థానానికి నేడు నామినేషన్లుదాఖలు చేసిన వారిలో హిల్. ఎస్. లింగ్‌డో [హెచ్ ఎస్. పి. డి.] యస్. డి. కొంగ్‌లిర్ [ఇం] వున్నారు.

సిక్కిం

సిక్కింనుండి ఛత్ర బహదూర్ ఛేత్రి (కాం) నేడు నామినేషన్ దాఖలు చేశారు.

బీహార్

బీహార్‌లోని బెత్తయ్య నియోజకవర్గం నుండి మాజీముఖ్యమంత్రి శ్రీ కేదార్‌పాండే (కాం)తోపాటు రామసకాయ్‌సింగ్ (మా) శ్రీమతిమాయాదేవి(ఇండి) తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

పూస్ప నుండి శ్రీ గోవిందదాస్ రిచారియా (కాం), కేంద్ర మాజీమంత్రి డాక్టర్ సుశీలా నాయర్ (జనతా)లు నామినేషనులు దాఖలు చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోనిబిల్హౌర్ నియోజకవర్గం నుండి కేంద్ర ఆర్థికశాఖ డిప్యూటీ మంత్రి శ్రీమతి సుశీలా రోహతగి నామినేషన్‌దాఖలు చేశారు.

పంజాబ్

పంజాబ్‌లోని ఫిల్లౌర్ స్థానానికి కమ్యూనిస్టు అభ్యర్థి మల్‌కిత్‌చంద్, అమర్‌చంద్ (ఇండి)లు నామినేషన్‌లు దాఖలు చేశారు.

రోపార్ నియోజక వర్గంలో అకాలీ అభ్యర్థి బసంత్‌సింగ్ ఖాల్సా బి. రాం (ఇండి)లు నేడు నామినేషన్‌లు దాఖలు చేశారు.

జమ్మూ-కాశ్మీర్

జమ్మూ-కాశ్మీర్ నుండి రైల్వేశాఖస్టేట్ మంత్రి శ్రీ మొహమ్మద్ షఫీఖురేషి నేడు నామినేషన్ దాఖలు చేశారు

శ్రీ ఖురేషి అనంతనాగ్ నుండి 1967లో ఎటువంటి పోటీ లేకుండా ఎన్నికయ్యారు 1971లో అత్యధిక మెజారిటీతో గెలుపొందారు.

అనంతనాగ్‌లో గులామ్ హస్సన్ ఇంక్విలాబ్(ఇండి)కూడా నేడు నామినేషన్ దాఖలు చేశారు గతవారం పి.యల్.హండూ[ఇండి] నామినేషన్ దాఖలు చేశారు,

రైల్వే లైనువెంట మార్గాన్ని అందంగా తీర్చిదిద్దే పథకం

మద్రాసు, ఫిబ్రవరి 16

కేంద్రప్రభుత్వం ఆమోదించిన పథకం క్రింద రైలుమార్గాల కిరుపైపులా అందంగా తీర్చిదిద్దడానికి వివిధ రైల్వేమండలాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయబడింది.

ఈ విషయాన్ని నేడిక్కడ మీనంబాకం విమానాశ్రయంలో కాన్పూర్ చంద్రశేఖర్ అజాద్ వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా॥ డి ఎన్. కౌల్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ తెలియచేశారు.

రైల్వే యింజనీరులు అనుసరించే యీ పథకం క్రింద రైల్వేలైన్ల కిరుపక్కలా వుండే ఖాళీలల్లో వైద్యానికి ఎనికొచ్చే మొక్కలతోసహా ఉపయోగపడి, ఆదాయానిచ్చే మొక్కలను నాటడం జరుగుతుందని తెలిపారు

డా॥ కౌల్ వెంటయూనివర్సిటీలో ఓషధి విభాగండైరక్టర్ వృక్షశాస్త్రజ్ఞుడు డా॥ డి కె మూర్తికూడా వున్నారు. డా॥ మూర్తి జ్వర ధూముల సాగుబడిలో నిపుణుడు కూడాను.

నగరంలో వున్నప్పుడు డా॥ కౌల్ దక్షిణ రైల్వేకి చెందిన ఈ ప్రత్యేక విభాగం సమావేశంలో పాల్గొన్నారు.

రెండు నెలల క్రితం రైల్వేబోర్డు అధిపతుల సమావేశం రాయ్పూరులో జరిగిందని, ఈ పథకానికి సంబంధించిన వివరాలు తెలుపడం కూడా జరిగిందని డా॥ కౌల్ చెప్పారు

ఈ సందర్భంగా డా॥ కౌల్ కోయంబత్తూరు, హైదరాబాద్, బెంగుళూరులలో కూడా పర్యటించనున్నారు

దిగువస్థాయి రైల్వే ఉద్యోగులకు శిక్షణ యిచ్చే పథకాన్నికూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఢిల్లీలో పోటీచేసే జనతాపార్టీ అభ్యర్థులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16

ఢిల్లీ సాదర్ నియోజకవర్గంనుండి శ్రీ కన్వర్‌లాల్ గుప్తా, దక్షిణ ఢిల్లీ నియోజకవర్గంనుండి శ్రీ విజయకుమార్ మల్హోత్రాలు పోటీచేస్తారని జనతాపార్టీ మొన్న ఇక్కడ ప్రకటించింది.

ఔటర్ ఢిల్లీస్థానంలో శ్రీ చౌదరి బ్రహ్మ ప్రకాశ్, కరోల్‌బాగ్ నియోజకవర్గంనుండి శివనారాయణ్ సర్సోనియా పోటీ చేస్తారని తెలిసింది. ఢిల్లీ తూర్పు నియోజకవర్గాన్ని ప్రజాస్వామ్య కాంగ్రెస్‌కు వదిలివేయటం జరిగిందని తెలిసింది,

బొంబాయిలో జనతాపార్టీ అభ్యర్థుల ప్రకటన

బొంబాయి, ఫిబ్రవరి 15

బొంబాయిలోని 6 నియోజకవర్గాలలోనూ పోటీచేసే తన అభ్యర్థులను జనతాపార్టీ నిన్న ప్రకటించింది.

బొంబాయి సౌత్ నుండి రతన్‌సింగ్ రాజ్‌దా బొంబాయి నార్త్ ఈస్టునుండిడాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి, బొంబాయి నార్త్ వెస్టు నుండి శ్రీ రామ్‌జెత్ మలని, బొంబాయి నార్త్‌నుండి శ్రీమతి మృణాల్ గోరే పార్టీకి అభ్యర్థులుగా పోటీ చేస్తారు.

బొంబాయి సౌత్ సెంట్రల్‌లో శ్రీ ఆర్. సి. కంబ్లే [రిపబ్లికన్] బొంబాయి సౌత్ సెంట్రల్ నుండి శ్రీమతి అహల్యా రంగ్నేకర్ (మార్క్సిస్టు)లను జనతాపార్టీ బలపరుస్తుందని రాష్ట్ర జనతాపార్టీ అధ్యక్షులు శ్రీ యస్. యం. జోషి ఒక ప్రకటనలో తెలిపారు.

మయూర్‌భంజ్‌లో అభ్యర్థి మార్పు

ఒరిస్సాలోని మయూర్‌భంజ్‌లో జనతా పార్టీ తన అభ్యర్థిని మార్పుచేసింది ఈ నియోజకవర్గంలో గతంలో ప్రకటించిన శ్రీ పీతాంబర్‌సింగ్ స్థానే శ్రీ చంద్రమోహన్ సింగ్ పోటీ చేస్తారని రాష్ట్ర జనతా పార్టీ అధ్యక్షులు శ్రీ బిజూపట్నాయక్ ఒక ప్రకటనలో కోరారు.

బిజూపట్నాయక్‌చే నామినేషన్ దాఖలు

భువనేశ్వర్, ఫిబ్రవరి 15

జనతాపార్టీ నాయకులు శ్రీ బిజూపట్నాయక్ కేంద్రపర నియోజకవర్గంనుండి లోక్‌సభకు పోటీచేయటానికి నేడు నామినేషన్ దాఖలు చేశారు

ఒరిస్సాలో 2 సీట్లలో సి. డి. యస్.కు జనతాపార్టీ మద్దతు

ఒరిస్సాలో రెండు నియోజక వర్గాలలో ప్రజాస్వామ్య కాంగ్రెసును ఒక నియోజక వర్గంలో మార్క్సిస్టుపార్టీ అభ్యర్థిని జనతా పార్టీ బలపరుస్తుంది,

ప్రజాస్వామ్య కాంగ్రెసు అభ్యర్థులుగా బర్హంపూర్‌లో పోటీ చేస్తున్న శ్రీ శంకర గిరిని, డెంకనాల్ నుండి పోటీ చేస్తున్న శ్రీ దేవేంద్ర శతపథిలను జనతాపార్టీ బలపరుస్తున్నది.

భువనేశ్వర్‌లో మార్క్సిస్టు పార్టీకి చెందిన శ్రీ శివాజీ పట్నాయక్‌ను జనతా పార్టీ బలపరుస్తుంది.

ముగ్గురు శాసనసభ్యులు కాంగ్రెస్‌లో చేరిక

ప్రతిపక్షాలకు చెందిన ముగ్గురు ఒరిస్సా శాసనసభ సభ్యులు కాంగ్రెస్‌లో చేరినట్లు ఒరిస్సా పి. సి. సి అధ్యక్షులు శ్రీ చింతామణి జెనా నిన్న భువనేశ్వర్‌లో తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన వారిలో శ్రీ బృందబన్‌నాయక్ (జనతాపార్టీ), శ్రీ ప్రమోద్ చంద్ర భంజదేవ్ (ఇండిపెండెంట్), శ్రీ త్రిలోచన్‌సింగ్ దేవ్ (ఇండిపెండెంట్) వున్నారు

మాజీ డి ఎం.కె మంత్రి అన్నా డి.ఎం.కె.లో చేరిక

మాజీ డి యం కె మంత్రి శ్రీ యస్ రామచంద్రన్ నిన్న ఆలిండియా అన్నా డి యం కె.లో చేరారు.

ఎ ఐ ఎ డి యం. కె ప్రధాన కార్యదర్శి శ్రీ యం జి. రామచంద్రన్ సమక్షంలో ఆయన చేరారు.

ఈ విషయాన్ని శ్రీ రామచంద్రన్ (మాజీమంత్రి) పత్రికా సమావేశంలో తెలిపారు

సభలు - సమావేశాలు

కావలితాలూకా కమ్యూనిస్టుసమితిసభ్యుల, సానుభూతిపరుల సమావేశం ఈనెల 17 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలనుండి కావలి వాణి ట్యుటోరియల్ కాలేజీలో జరుగుతుంది.

* * *

వరంగల్‌జిల్లా మానుకోట తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతిపరుల సమావేశం ఈనెల 18 వ తేదీ ఉదయం 10 గంటలకు మానుకోట పార్టీ ఆఫీసులో జరుగుతుంది.

రేడియో

శుక్రవారం. ఫిబ్రవరి 18
శక 1898 మాఘ 29

హైదరాబాద్-ఎ

ప్రసారము I

5.55 వందేమాతరం, 7.15 గాంధీ మార్గం; 7.30 చిత్రపీను; 9.00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11.45ఉన్నతపాఠశాలలకు; 12.05 ప్రాథమిక పాఠశాలలకు; 12 20 హిందీ పాఠం; 1.00 చిత్రపీను; 2.10 ఉన్నత పాఠశాలలకు; 2 30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5.15 సంగీత సుధ; సంగీత శిక్షణ (విజయవాడ నుండి); 8 00 మీరు కోరిన పాటలు; 8 45 లలిత సంగీతం: కె. శేషుబాయి; 9.30 దక్షిణప్రాంత సంగీత సభ; 10.30 ప్రసార సమాప్తి

విజయవాడ

ప్రసారము I

5.55 వందేమాతరం, 6.55 సంక్షిప్త వార్తలు; 7.15 గాంధీమార్గం; 7.45 చిత్రతరంగిణి; 9.00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11.45 ఉన్నత పాఠశాలలకు; 12 05 టి దక్షిణామూర్తి: క్లారినెట్; 1.00 చిత్రతరంగిణి; 2 10 ఉన్నత పాఠశాలలకు; 2.30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5.15 యువవాణి; 5.30 సంగీత శిక్షణ సీనియర్లకు); 8.15 పొన్నా - పొగడ; 9.15 స్పాట్‌లైట్; 9 30 దక్షిణ ప్రాంత సంగీత సభ; 10 30 ప్రసార సమాప్తి.

ఆకర్షణీయమైన బహుమతులు గెలవండి - ఎంట్రీ ఫీ లేదు.

మొదటి బహుమతి: వాచీలు, కెమేరాలు, టేపు రికార్డర్, రికార్డ్ ప్లేయర్స్‌లో ఒకటి కన్సొలేషన్ బహుమతి: జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ లేక అమెరికన్ డిజైన్ కారీన్, అమ్మకం ప్రాతిపదికకోసం మా తమే ఏ సొల్యూషన్‌కు సంబంధంలేని సొల్యూషన్‌కి మొదటి బహుమతి. అదేవిధంగా ఉన్నవాటికి కన్సొలేషన్ బహుమతులు ఇవ్వబడును. ప్రమోటర్ల నిర్ణయమే చివరిది మరియు కట్టుబడ్డమైనది. ముగింపు తేదీ 4-3-77.

నమూనాలోలాగా చదరపు గళ్ళను గియండి. 9 (తొమ్మిది) నుండి 17 (పదిహేడు) వరకుగల అంకెలలో ఒక అంకె ఒకసారిమాత్రమే ఉపయోగించి ఎటుకూడినా 39 (ముప్పదితొమ్మిది) వచ్చేటట్లు పూరించాలి ఫలితాలు తరువాత గెలుపొందినవారికి పోస్టేజి, ప్యాకింగ్‌ఫీజు మున్నవి చెల్లించుటకు తెలుపబడును. బహుమతులు ఇంటిమేషన్ లెటరులో తెలియజేయబడిన విధంగా పంపబడతాయి.

VIKING ELECTRONICS (VA-39)
Kailash Nagar, DELHI - 110031

వేలాదిగా సభ్యులు రు. 500 నుంచి రు. 2,50,000 వరకు గెలుచుకొన్నారు. గుజరాత్ సేవింగ్స్ విజేతలందరికి శుభాభినందనలు. మీరు కూడా రు. 2,00,000 లేదా 61,000 ఇతర బహుమతులు ఏవైనా బాలాజీగ్రూపులోచేరడంద్వారా గెలవవచ్చు. నేడేమాకు రు. 23పంపండి.



విజేతలలో కొందరిని పై చిత్రంలో చూడవచ్చు.

గుజరాత్ సేవింగ్స్
(ఏ. పి.) విజయవాడ ప్రాంతం బ్రాంచీలు
★ మెయిన్: కోటవారిబిల్డింగ్, బీసెంట్‌రోడ్డు, గాంధీనగర్, విజయవాడ-3
బ్రాంచీలు:
★ 45-22-5, స్టేషన్‌రోడ్డు విశాఖపట్నం-530004 ★డాక్టర్ సుబేదార్స్ క్లినిక్ పైన, గాంధీ చౌక్, నిజామాబాద్ 3-8-27 షాబజార్ మహబూబ్‌నగర్ ★1-6-51 మార్కెట్‌రోడ్డు క్లాక్ టవర్ దగ్గర, జగిత్యాల్, కరీంనగర్‌జిల్లా ★ అనంత్ లాడ్జిబిల్డింగ్స్, హనుమకొండచౌరస్తా వరంగల్ జిల్లా.

ఏజంట్లు. జయప్రద ఏజన్సీ, మెయిన్‌రోడ్డు రాజమండ్రి. 3, మెసర్స్ దయాళ్ అండ్ కో, ఏలూరు, మెసర్స్ చక్రవర్తి అర్ టి సి. బస్సు డిపోవెనక, ఖమ్మం ★ మెసర్స్ రవి ఏజన్సీస్ హోటల్ కిన్నెరఎదుట, ఖమ్మం ★ భవానీ ట్రేడర్స్, ట్రంకురోడ్డు, నెల్లూరు.
హెచ్. ఓ. 518, కల్బాదేవి రోడ్డు, బొంబాయి-400002 టెలిఫోన్లు: 310605, 310533.
ఇండియా అంతటా బ్రాంచీలు కలవు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రింటరు, అండ్ పబ్లిషరు: టి. వెంకటేశ్వరరావు. ఎడిటరు: సి. రాఘవాచారి, ముద్రణ: విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ 520004. R. No. 1138/75